



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

జాతీయ రహదారుల నిర్మాణాల్లో

వేగం పెంచాలి

- ప్రజారవాణా కోసం విలువైన భూములిచ్చే రైతుల త్యాగాలను గుర్తించాలి
- వారు నష్టపోకుండా పరిహారం అందించాలి
- అధికారులతో సమీక్షలో మంత్రి తుమ్మల ఆదేశాలు

ఖమ్మం, జనవరి 8 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం జిల్లాకు మణిహారంగా మారనున్న అన్ని జాతీయరహదారుల నిర్మాణాల్లో వేగం పెంచాలని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ సచివాలయంలో ఖమ్మం జిల్లాలో నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారుల పనుల పురోగతి, రైతులకు అందించే పరిహారంపై ఆర్‌అండ్‌బీ అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. ఖమ్మం - దేవరపల్లి, అమరావతి-నాగ్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్‌జాతీయ రహదారులకు సంబంధించిన పనుల పురోగతిపై చర్చించిన ఆయన.. ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సంబంధించి ఖమ్మంజిల్లా తెలంగాణ సరిహద్దు వరకు ఎంట్రీ, ఎగ్జిట్ల నిర్మాణం ఎక్కడెక్కడ చేపడుతున్నారన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారికి విజయవాడ -జగదల్‌పూర్ హైవే వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవేకు ప్రవేశ, ముగింపు ద్వారాలు ఏర్పాటుచేయాలని సూచించారు. ఫలితంగా సత్తుపల్లి ప్రాంత ప్రజలతో పాటు నూజివీడు, తిరువూరు ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యం సౌలభ్యంగా ఉంటుందన్నారు. అమరావతి-నాగపూర్ గ్రీన్‌ఫీల్డ్‌హైవేకు సంబంధించిన అలైన్‌మెంట్‌పై పునఃపరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మంజిల్లాలో భూములు కోల్పోయిన రైతులకు మార్కెట్ ధరలకు అనుగుణంగా భూసేకరణ పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసకోవాలన్నారు. ఖమ్మం నియోజకవర్గంలో పాటు పరిసర ప్రాంతాల్లో జాతీయ రహదారి కోసం కొత్తగా చేపట్టే భూసేకరణలో నిర్వాసితులకు ఎక్కడా అన్యాయం జరగకుండా చూడాలనాల్నారు. నిర్వాసిత రైతుల భూముల ధరలు మార్కెట్ రేట్ల కనర్నా అధికంగా పరిహారం చెల్లింపేలా చూడాలన్నారు. ప్రజారవాణ కోసం విలువైన భూములు ఇస్తున్న రైతుల త్యాగాలు గుర్తించి వారికి న్యాయం చేయాలన్నారు. ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేలో ఖమ్మం నియోజకవర్గ పరిధిలో అవసరమైన అన్ని ప్రాంతాల్లో సర్వీసు రోడ్లు, అండర్‌పాస్‌లు ఏర్పాటుచేయాలన్నారు. రైతులు, ప్రజల రవాణకు అనుకూలంగా ఉండేలా అన్నిరకాల వాహనాలు రాకపోకలుసాగించేలా, రైతుల ఉత్పత్తులు తరలించుకునే విధంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అండర్‌పాస్‌లు చేపట్టాలన్నారు. గ్రీన్‌ఫీల్డ్ రహదారికి భూముల ఇచ్చిన రైతులతోపాటు రహదారి పక్కనే సాగు చేసుకునే రైతులకు భవిష్యత్తులో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మంత్రి తుమ్మల అధికారులకు దిశానిర్దేశంచేశారు. ఈసమీక్షలో ఆర్‌అండ్‌బీ సెక్రటరీ శ్రీనివాసరాజు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

విశ్వరూప వైభవం



భద్రాచలంలోని రామాలయంలో నిర్వహించిన విశ్వరూప సేవ

- భద్రాద్రిలో ఘనంగా సర్వదేవతా అలంకరణ
- దర్శించి తరించిన భక్తజనం
- ఈ సేవ భద్రాద్రికే ప్రత్యేకం

భద్రాచలం, జనవరి 8: వైకుంఠ ఏకాదశి తరువాత వచ్చే బహుళ ద్వాదశి సందర్భంగా సోమవారం భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో విశ్వరూపసేవ (సర్వదేవతా అలంకరణ)ను వైభవంగా నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి తరువాత వచ్చే బహుళ ద్వాదశి ఘడియల్లో ఉత్సవమూర్తులందరినీ ఒకేచోట చేర్చి ఆరాధాన నిర్వహించడం భద్రాద్రి దేవస్థానంలో ప్రత్యేకత. ఈ సందర్భంగా ఆలయంలోని 108 దేవతామూర్తులను ఒకేచోటకు చేర్చి ప్రత్యేక అలంకరణ చేయడంతో భద్రాద్రి కలియుగ వైకుంఠాన్ని తలపించింది. ఈ క్రమంలో 'అంతా రామమయం..ఈ జగమంతా రామమయం' అంటూ దేవస్థానం విద్వాంసులు కీర్తనలను ఆలపిస్తుండగా భక్తి తన్మయత్వంతో భక్తులు పులకించారు. రాముడే విశ్వరూపుడిగా భావించి ఆలయంలోని వరాహస్వామి, వేంకటేశ్వరస్వామి, కృష్ణుడు తదితర ఉత్సవమూర్తులతో పాటు ఆళ్వార్ల ఉత్సవ విగ్రహాలను సర్వదేవతా అలంకారంలో కొలువుదీర్చారు. ఈ సందర్భంగా సువర్ణ పుష్పాలతో స్వామి వారికి అష్టోత్తర శతనామార్చన నిర్వహించి.. చతుర్వేద విన్నపాలను స్వామి వారికి సమర్పించారు. ఈ ఉత్సవం సందర్భంగా గరుడ వాహనంపై రాములవారు ఆసీనులు కాగా సాయంకాలం సమయంలో ఆయన సన్నిధిలో ఇతర ఉత్సవమూర్తులకు ఆరాధన నిర్వహించి కదంబం అనే ప్రత్యేక ప్రసాదాన్ని నివేదన చేశారు. ఈ విధంగా భద్రాద్రి దేవస్థానంలో తప్ప మరెక్కడా విశ్వరూపసేవ నిర్వహించడం లేదు. కార్యక్రమంలో దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్, ఆలయ ఈవో రమాదేవి, ఏఈవోలు శ్రావణ్‌కుమార్, భవానీ రామకృష్ణారావు, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్, వైదిక పరిపాలన సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



సీతారామచంద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

రామయ్యను దర్శించిన దేవాదాయశాఖ కమిషనర్

భద్రాద్రి రామయ్యను సోమవారం దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ మల్లికార్జునరెడ్డి, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి పాల్గొన్నారు.

విష్ణు వారియర్‌కు ఆత్మీయ వీడ్కోలు



విష్ణువారియర్‌ను సన్మానిస్తున్న పోలీసు అధికారులు

ఖమ్మంక్రైం, జనవరి 8: బదిలీపై కేంద్ర సర్వీసులకు వెళుతున్న ఖమ్మం పూర్వ పోలీసుకమిషనర్ విష్ణుఎస్‌వారియర్‌కు ఖమ్మం పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలికారు. సోమవారం నగరంలోని కేఎల్‌సీలో నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో జిల్లాలోని పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, ఇతర సిబ్బంది ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడడంలో తనదైన పాత్ర పోషించారని, బాధితులకు అండగా నిలవాలనే లక్ష్యంతో తాను పనిచేయమే కాకుండా జిల్లా పోలీసుయంత్రాగాన్ని సమన్వయంపరుస్తూ ముందుకు నడిచారన్నారు. అనంతరం విష్ణువారియర్ మాట్లాడుతూ సిబ్బంది తనపై చూపిన అభిమానానిని కృతజ్ఞతలని, కొత్త పోలీసుకమిషనర్ సునీల్‌దత్ ఆధ్వర్యంలో పోలీసుయంత్రాంగం మరింత సమర్థవంతంగా పనిచేయాలన్నారు. జిల్లాతో ఉన్న అనుబంధాన్ని, ఇక్కడి అధికారులు, సిబ్బంది సహకారాన్ని మరువలేనని మరో రెండురోజుల్లో కేంద్ర సర్వీసుల్లోని కీలక విభాగంలో బాధ్యతలు తీసుకునేందుకు వెళుతున్నట్టు తెలిపారు.కార్యక్రమంలో ఏడీసీపీ ప్రసాదరావు, ఏసీపీలు గణేష్, హరికృష్ణ, ప్రసన్నకుమార్, బస్వారెడ్డి, రహమాన్, రామానుజం, శివరామయ్య, రవి, నరసయ్య, సుశీల్‌సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉండాల్సింది 433..

ఉన్నది 67మంది..

- ఖమ్మం సర్వజన ఆసుపత్రిలో వైద్యులు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది కొరత
- వీవీపీ పరిధిలో వైద్యుల బదిలీతో మొదలైన సమస్య
- సేవలందక రోగులు, ప్రజల ఇబ్బందులు

● పదిరోజుల క్రితం కారేపల్లి మండలం రంగురాళ్ల బోడు గ్రామంలో జరిగిన ఘర్షణలో రాజు అనే వ్యక్తి తీవ్ర గాయాలపాలవగా ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో చేసేది లేక.. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చింది.

● సత్తుపల్లికి చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రంగా గాయపడి.. ఖమ్మం దవాఖానాకు రాగా న్యూరో స్పెషలిస్ట్ లేరని హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. కనీసం ప్రాథమిక చికిత్స కూడా చేయడానికి వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఆ వ్యక్తి మార్గం మధ్యలోనే మృతిచెందాడు.

ఇలాంటి సంఘటనలు ప్రస్తుతం జిల్లా జనరల్ ఆస్పత్రిలో రోజుకి రెండు నుంచి మూడు సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. అయినా వైద్యాధికారులు ఆ పైన ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతేడాది ఆగస్టులో ఖమ్మంలో మెడికల్ కళాశాల ఏర్పాటవగా.. దానికి అనుసంధానంగా వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్న జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని బోధనాసుపత్రిగా మార్చారు. బోధనాసుపత్రి అయితే ప్రత్యేకవైద్య నిపుణులు అందుబాటులో ఉండి రోగులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని భావించిన ప్రజలకు జిల్లా జనరల్ ఆస్పత్రి డొల్లతనం నరకం చూపుతోంది. పర్యవేక్షించాల్సిన ఆస్పత్రి అధికారులు అసలు విషయాలను వదిలి పెట్టి పనికిరాని అంశాలపై దృష్టి సారించి సిబ్బందిని ఇబ్బందుల పాలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 8 : ఉమ్మడిజిల్లాతో పాటు, ఏపీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని సరిహద్దు ఐదారు జిల్లాల నుంచి ప్రజలు, రోగులు వైద్యం కోసం వచ్చే ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిని 550 పడకల సామర్థ్యంతో అభివృద్ధి చేశారు. అన్ని వైద్య విభాగాల్లో కలిసి కనీసం 150మంది వరకు శాశ్వత వైద్యులు ఉండాలి. మొత్తంగా 433 సిబ్బంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 67మంది మాత్రమే ఉన్నారు. ఇంకా 366పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 139 మంది కావాల్సి ఉంది. 203 మంది స్టాఫ్ నర్సులు, 24 మంది ల్యాబ్ టెక్నీషియన్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జనరల్ మెడిసిన్ విభాగంలో ఇద్దరు మాత్రమే ఉన్నారు. యూరాలజీ, ఈఎన్టీ, కార్డియాలజీ, రెడియోథెరఫీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, నెఫ్రాలజీ, ఎండో క్రైనాలజీ , న్యూరాలజీలో వైద్యులు లేరు. ఇవన్నీ భర్తీ చేస్తేనే ఇక్కడ మెరుగైన వైద్యసేవలు అందనున్నాయి.



సమస్యలు తెచ్చిన 22 మంది వైద్యుల బదలాయింపు..

వైద్య విధాన పరిషత్ కింద పనిచేసిన వైద్యనిపుణులను ఇటీవలే ప్రభుత్వం స్థాన చలనం చేసింది. 11మంది సివిల్ సర్జన్లను, మరో 11 మంది అసిస్టెంట్ సివిల్ సర్జన్లను వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులకు బలవంతంగా పంపించి వేశారు. దీంతో జిల్లా జనరల్ ఆస్పత్రిలో వైద్య సేవలకు ఆటంకం కలుగుతోంది. ఇక్కడ క్యాజువాలిటీలో విధుల్లో ఉండాల్సిన వైద్యులు (ప్రత్యేక నిపుణులు) అందుబాటులో లేకపోవడం.. కేవలం ఎస్ఆర్(సీనియర్ రెసిడెన్స్)లతో విధులు నిర్వహింపజేస్తుండటంతో వారు కేసులన్నిటిని హైదరాబాద్‌కు రిఫర్ చేస్తున్నట్టు సమాచారం. దీంతో ప్రాణాపాయ పరిస్థితులో వచ్చే రోగులకు ఇక్కడ వైద్యసేవలు అందకపోవడం. రిఫర్ చేస్తున్న సందర్భంగా మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోతున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఓ రెండు నెలలుగా ఈ పరిస్థితులు ఇక్కడికి వచ్చే రోగులను మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇప్పటి వరకు ఈ నిపుణులు మాతాశిశు సంరక్షణ కేంద్రంతో పాటు , ఆస్పత్రిలో కీలక విభాగాల్లో విధులు నిర్వహించారు. అర్థాంతరంగా వారందరినీ బయటకు పంపించడంతో ఆపోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. దీంతో మాతాశిశు కేంద్రంలో, జనరల్ ఆస్పత్రి విభాగాల్లో వైద్యులు లేక నిర్లిప్తతగాఉంది. దీంతో రోగులు వస్తున్నారు.. కానీ గతంలో లా సేవలుఅందక పోవడంతో నిరాశతో వెనుదిరిగి వెళ్తున్నారు.

నిర్వహణలో లోపాలెన్నో..

మెడికల్ కళాశాలకు అనుసంధానంగా ఉన్న జిల్లా జనరల్ ఆస్పత్రిలో స్వయం ప్రతిపత్తితో నిర్వహిస్తున్నా పర్యవేక్షణ అధికారులు నిర్ణయాలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని, దీంతో ఆస్పత్రిలో ఇప్పటి వరకు పనిచేసిన ఓట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. ఇక మోకీలు ఆపరేషన్లకు, ఇతరత్రా సర్జరీలు ఆరోగ్యశ్రీ ద్వారా నిర్వహిస్తున్నా సంబంధిత కాంట్రాక్టర్లకు బిల్లులు ఇప్పించడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నట్టు విమర్శలున్నాయి. దీంతో వైద్యులు ఆ ఆపరేషన్లను నిలిపేశారు. అలాగే ఉస్మానియాతర్వాత అంతటి స్థాయిలో రూ.7కోట్లతో ఏర్పాటు చేసిన క్యాథ్‌లాబ్‌లోనూ అరకొరగా ఆపరేషన్లు జరుగుతున్నాయి. ఇక్కడి సర్జరీలకు, స్టెంట్లు, ఇంజక్షన్లు ప్రైవేటుగానే కొనుగోలు చేస్తుండగా ఆ బిల్లులు కూడా రాకపోతుండటం పెద్ద సమస్యగా మారింది. దీంతో రోగులు రోజుల తరబడి వార్డుల్లో ఉండాల్సి వస్తోంది. ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ ద్వారా ఎంఆర్‌ఐతో పాటు ఇతర పరీక్షలను ప్రైవేటు ల్యాబులకు రిఫర్ చేసేవారు. వాటికి కూడా బిల్లులు పెండింగ్ పడటంతో ల్యాబుల వారు ఒప్పందాన్ని రద్దుచేసుకున్నారని సమాచారం. అత్యవసర విభాగాల్లో అవసరమైన వాటిపై నిర్ణయాలు తీసుకోవడం, అమలు చేయడంలో ఆస్పత్రి స్థాయి అధికారుల ఉదాసీనత, సిబ్బందితో విభేదాలతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలుస్తోంది. నెఫ్రాలజీ, యూరాలజీ విభాగాలపైనా నిర్లక్ష్యం చేయడంతో ఆ విభాగాలన్నీ ఇప్పుడు మూతపడ్డాయి. ఈ సేవల కోసం రోగులు జిల్లా జనరల్ ఆస్పత్రికి వచ్చి తిరిగి ప్రైవేటు ఆస్పత్రులకు బారులు కడుతున్నారు.

సూపరింటెండెంట్ ఏమంటున్నారంటే..?



జిల్లా జనరల్ ఆస్పత్రిలో వైద్యుల కొరతపై డీఎంఈ నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఆసుపత్రి సూరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఇక్కడి ఖాళీల పరిస్థితిపై ఇప్పటికే నివేదికలు, ప్రతిపాదలను పంపామని, ఫిబ్రవరి నాటికి పూర్తిస్థాయిలో వైద్యుల నియామకం ఉంటుందని భావిస్తున్నామన్నారు. 203మంది స్టాఫ్‌నర్సులు త్వరలో వస్తున్నారని, ఇవన్నీ సమకూరిన తర్వాత వైద్యసేవలు మెరుగుపడతాయని, అప్పటి వరకు కూడా ఉన్న సిబ్బందితో వైద్యసేవలను అందిస్తామన్నారు.

డిసెంబరులో డయల్ 100కు 3,236కాల్స్

ఖమ్మంక్రైం, జనవరి 8 : సమాజంలో పెరుగుతున్న నేరాలను నియంత్రించడంతో పాటు ప్రజలకు సత్వర సేవలందించే లక్ష్యంతో ఏర్పాటైన డయల్100కు గత డిసెంబరు నెలలో ఖమ్మం కమిషనరేట్ పరిధిలో నుంచి 3,236కాల్స్ వచ్చాయని, వాటిపై విచారణ జరిపి 62 కేసులు నమోదు చేశామని పోలీసుకమిషనర్ సునీల్‌దత్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీటిలో హత్యకు సంబంధించి ఒకటి, హత్యాయత్నం మూడు, మహిళలపై వేధింపులు రెండు, దొంగతనాలు ఎనిమిది, రోడ్డుప్రమాదాలు ఎనిమిది, అనుమానాస్పద మరణాలు నాలుగు, సాధారణ ఘటనలు 15, ఇతర కేసులు 21 ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలు అత్యవసరపరిస్థితుల్లో డయల్100కు ఫోన్‌చేసి ప్రజలు పోలీసుల సహాయం పొందవచ్చని ఆయన పేర్కొన్నారు.

1984 బ్యాచ్ కానిస్టేబుళ్ల ఆత్మీయ కలయిక



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన 1984బ్యాచ్ కానిస్టేబుళ్లు

ఖమ్మంక్రైం, జనవరి 8: 1984 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు సోమవారం ఖమ్మం నగరం ప్రకాష్‌నగర్ సమీపంలోని ఓ మామిడితోటలో ఆత్మీయసమ్మేళనం నిర్వహించారు. ఈసమ్మేళనంలో పలువురు మాట్లాడుతూ 1984 అక్టోబరు 1న ఖమ్మంలో పోలీసు కానిస్టేబుళ్లుగా ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నామని, 40 ఏళ్లు గడిచిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. తమలో కొందరం ప్రస్తుతం కానిస్టేబుల్, ఏఎస్ఐ, ఏఆర్ఎస్ఐ, ఎస్ఐ హోదాల్లో పలు చోట్ల విధులు నిర్వహిస్తున్నామని, కొందరు ఉద్యోగ విరమణ చేశారన్నారు. ప్రస్తుతం వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్న వారందరినీ ఆర్ఎస్ఐ లక్ష్మణ్ చొరవతో నాలుగు దశాబ్దాల తర్వాత కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు.

'సీతారామ'తోనే శాశ్వత పరిష్కారం

» నికర జలాలతోనే వైరా రిజర్వాయర్ ఆయకట్టు రైతులకు పూర్తి భరోసా



వైరా, జనవరి 8: సీతారామ ప్రాజెక్టు నీటితోనే వైరా ఆయకట్టుకు శాశ్వత పరిష్కారం లభించనుంది. వర్షాధారంగా నిర్మించిన మధ్య తరహాకు చెందిన వైరా రిజర్వాయర్ ఇప్పుడు బహుళప్రయోజనాలను తీర్చే రిజర్వాయర్‌గా రూపాంతరం చెందింది. ఏటా ఈ రిజర్వాయర్ ఆయకట్టులో సాగు ప్రశ్నార్థకంగా మారుతున్న క్రమంలో.. నికర జలాలతోనే రైతులకు శాశ్వత భరోసా దక్కనుంది. 1923లో నాటి నిజాంనవాబ్ ఈ రిజర్వాయర్ నిర్మాణాన్ని ప్రారంభించి ఏడేళ్లు అంటే 1930నాటికి పూర్తిచేశారు. కుడి, ఎడమకాల్వల ద్వారా 12వేల ఎకరాలు స్థిరీకరణ ఆయకట్టుగా నిర్ధారించారు. కుడికాలువ 24కిలోమీటర్ల పొడవుతో 29 డిస్ట్రిబ్యూటరీలతో అలాగే ఎడమ కాల్వ 16కిలోమీటర్ల పొడవు, 22డిస్ట్రిబ్యూటరీలతో నిర్మించారు. 1969లో మళ్లీ లోకలైజేషన్ చేయగా రెండు కాలువల కింద ఆయకట్టు 17,300ఎకరాలకు పెరిగింది. ఆ తర్వాత మళ్లీ ఇంతవరకు ఆయకట్టు లోకలైజేషన్ చేయలేదు. ప్రస్తుతం అనధికారికంగా 25వేల ఎకరాల ఆయకట్టు సాగవుతున్నట్లు అంచనా. ఎన్నెస్పీ ప్రాజెక్టు పూర్తికాకముందు వర్షాధారంగా వచ్చిన వరదనీటితోనే రిజర్వాయర్ కుడి, ఎడమకాలువల కింద వరిపంట సాగుచేసేవారు. 1975ప్రాంతంలో తీవ్ర కరువు రావడంతో రిజర్వాయర్ పూర్తిగా ఎండిపోయి ఆసమయంలో రైతులు పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయారు. తర్వాత రెండు, మూడేళ్లు వరుసగా రిజర్వాయర్‌లో నీరు లేక ఆయకట్టులో జొన్న, సజ్జలు లాంటి పంటలు సాగుచేశారు. ఎన్నెస్పీ కాల్వ నిర్మాణ సమయంలో ఏన్కూరు మండలంలోని తిమ్మారావుపేట సమీపంలో 21ఎంబీసీపై వైరా రిజర్వాయర్‌కు సాగర్‌జలాలు వచ్చే విధంగా జలగం వెంగళరావు చొరవతో ఎస్కేప్ లాకులను నిర్మించారు. ఆ ఎస్కేప్ లాకుల నుంచి సాగర్ జలాలు విడుదల చేసినట్లయితే దాదాపు 20కిలోమీటర్లకుపైగా పగిడేరులోనుంచి రిజర్వాయర్‌కు వచ్చిచేరతాయి. ఎన్నెస్పీ పరిధిలోకి వైరా రిజర్వాయర్ రాకపోవడంతో సాగర్‌జలాలను విధిగా విడుదల చేసే పరిస్థితి కూడా లేదు. ప్రభుత్వం దయాదాక్షిణ్యాలపై ఆధారపడి మాత్రమే సాగర్‌జలాలు వైరాకు విడుదల చేస్తున్నారు.

మిషన్‌భగీరథతో మరింత సమస్య..

11మండలాలకు తాగునీటిని అందించేందుకుగానూ వైరా రిజర్వాయర్ వద్ద మిషన్ భగీరథ పథకాన్ని నిర్మించారు. ఈ తాగునీటి అవసరాల కోసం రిజర్వాయర్‌లో 14అడుగులకుపైగా నీటిని నిల్వ ఉంచాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.3అడుగులు. కాగా మిషన్ భగీరథ కోసం 14అడుగుల నీటి నిల్వ ఉంచాల్సి రావడంతో ఆయకట్టులో సాగుకు కేవలం 4.3 అడుగుల నీరు మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఈ కొద్దిపాటి నీటితో 25వేల ఎకరాల్లో పంటల సాగు అసాధ్యంగా ఉంది. సాగర్ జలాలతో రిజర్వాయర్‌ను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ చేస్తామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించినా ఆచరణలో ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. దాంతో ఆయకట్టు రైతుల పరిస్థితి గందరగోళంగా తయారైంది.

30ఏళ్ల క్రితం గోదావరి నీటికోసం ప్రయత్నాలు..

1991 ప్రాంతంలోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలోని జిల్లా మంత్రి జలగం ప్రసాదరావు దుమ్ముగూడెం నుంచి వైరా రిజర్వాయర్ మీదుగా కృష్ణా నదిలోని పులిచింతల ప్రాజెక్టు వరకు గోదావరి పాయ పథకాన్ని రూ.500కోట్లతో నిర్మించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ప్రకటించారు. ఆతర్వాత కేంద్ర జలవనరుల శాఖ ఆధ్వర్యంలో కొంత సర్వే కూడా చేశారు. కొంతకాలానికి గోదావరి పాయపథకం సర్వే అటకెక్కింది. అది ఆచరణలో కార్యరూపం దాల్చినట్లయితే 30ఏళ్ల కిందటే వైరా రిజర్వాయర్ గోదావరి జలాలతో పరిఢవిల్లేది. రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఇందిరమ్మసాగర్ ప్రాజెక్టును ప్రారంభించడంతో వైరాకు గోదావరి జలాల సాకారమవుతాయని ఆయకట్టు రైతులు ఆశించారు. అది కూడా నెరవేరలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రస్తుత వ్యవసాయశాఖ మంత్రి, నాటి ఆర్అండ్‌బీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో రూ.13,500కోట్ల అంచనాలతో సీతారామ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించారు. ఇప్పుడు ఆప్రాజెక్టు పూర్తయితే గోదావరి జలాలు వైరాకు వచ్చే అవకాశముంది. యాతాలకుంట టన్నెల్ పూర్తిచేసి సత్తుపల్లి ట్రంక్ లంకపల్లి రిజర్వాయర్‌కు మరో చోట టన్నెల్ నిర్వహించటం ద్వారా వైరా రిజర్వాయర్‌కు ఈ వ్యవసాయ సీజన్లోనే లక్షన్నర ఎకరాలకు సాగునీరందే అవకాశముందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నీటిపారుదలశాఖ అధికారుల సమీక్ష సమావేశంలో స్పష్టం చేశారు. ఇదే జరిగితే గోదావరి జలాలు ఈ వ్యవసాయ సీజన్ నాటికే వైరా రిజర్వాయర్‌ను ముద్దాడనున్నాయి. తద్వారా వైరా ఆయకట్టు సాగునీటి వెతలు శాశ్వతంగా తీరనున్నాయి.

బిల్లులెట్టా?

» ఎస్‌డీఎఫ్ నిధుల కోసం కాంట్రాక్టర్ల ఎదురుచూపు..

» కార్పొరేషన్ కమిషనర్‌కు ఫిర్యాదు



కమిషనర్‌ను కలిసేందుకు వచ్చిన కాంట్రాక్టర్లు

ఖమ్మం కార్పొరేషన్, జనవరి 8 : ఖమ్మం నగరపాలకసంస్థకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్‌డీఎఫ్) రూ.50కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ నిధులతో నగరంలోని డివిజన్లలో సీసీ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టారు. కేవలం పనులను సాంకేతిక అనుమతి ఇచ్చి. నిధులు విడుదల చేయకపోవటంతో నగరపాలకసంస్థ కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. సోమవారం నగరపాలకసంస్థ కమిషనర్‌ను కలిసి తమ గోడు వెళ్లబుచ్చుకున్నారు.

రూ.22కోట్ల బిల్లులు పెండింగ్

నిధులు ప్రకటించిన వెంటనే పనులు చేయాలని నగరపాలకసంస్థకు చెందిన కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఆ మేరకు డివిజన్‌లో రూ.45లక్షల వ్యయంతో సీసీ డ్రెయిన్లు నిర్మించారు. ఇప్పటి వరకు రూ.22 కోట్లతో పనులు పూర్తి చేయగా. ఆరునెలలుగా నిధులు విడుదల చేయలేదు. ప్రభుత్వం మారటంతో అప్పటి ముఖ్యమంత్రి ప్రకటించిన నిధులు మంజూరు అవుతాయో, లేదోనని పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లు బెంబేలెత్తుతున్నారు. ఎల్ఆర్ఎస్ లేదా సుడా నిధులు నుంచైనా తమకు బిల్లులు చెల్లించాలని సోమవారం కమిషనర్‌ను కోరారు.

నిధులున్న పనులు.. బినామీలకు..

నగరపాలకసంస్థలో ఎల్ఆర్ఎస్ నిధులు, అలాగే సుడా నిధులున్నాయి. ఈ నిధుల ద్వారా చేసే పనులను బీఆర్ఎస్‌కు చెందిన ఒక మాజీ ప్రజాప్రతినిధి తన బినామీలకు ఇప్పించుకున్నారనే ఆరోపణలున్నాయి. సదరు నిధులతో ఖమ్మం నియోజకవర్గంలో పలుప్రాంతాల్లో సీసీ రహదారులు నిర్మించారు. పనులు పూర్తయిన వెంటనే బిల్లులు కూడా చెల్లించారు. కాగా ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టే సీసీ డ్రెయిన్ నిర్మాణాల పనులను నగరపాలకసంస్థకు చెందిన కాంట్రాక్టర్లకు బలవంతంగా అంటకట్టారు. 22 కోట్ల విలువైన పనులు పూర్తయినా, నిధులు ఎప్పుడు మంజూరు అవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. కాగా ఎస్‌డీఎఫ్ నిధులతో మిగిలిన పనులు చేయించకూడదని అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. కాగా ఎస్‌డీఎఫ్ బిల్లుల పెండింగ్ విషయాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది.





మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న గ్రానైట్ అసోషియేషన్ నాయకులు



భట్టి విక్రమార్కను సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

మంత్రులను కలిసిన గ్రానైట్ అసోసియేషన్ నాయకులు

ఖమ్మం ఖానాపురంహవేలీ, జనవరి 8: రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో జిల్లా నుంచి ముగ్గురు మంత్రులకు చోటు దక్కడం సంతోషకరమైన విషయమని, తద్వారా లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న గ్రానైట్ పరిశ్రమల సమస్యలు పరిష్కారానికి అవకాశం ఉంటుందని పరిశ్రమల యజమానులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ గ్రానైట్ రాష్ట్ర అధ్యక్షుడు రాయల నాగేశ్వరరావు, స్లాబ్ గ్రానైట్ జిల్లా అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణ ఆద్వర్యంలో పలువురు నాయకులు డిప్యూటీసీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం వారు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవ సాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును వేర్వేరుగా కలిసి వారిని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులను కలిసిన వారిలో పుసులూరి నరేందర్, కోటేశ్వరరావు, పారా నాగేశ్వరరావు, పి. యుగంధర్, శ్రీనివాస్‌రెడ్డి, రాకేష్, ఖాసిం, టైల్స్ అసోషియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, రమేష్, తదితరులున్నారు.

పాల్వంచలో భారీగా పట్టుబడ్డ టేకు కలప

» అక్రమ రవాణా వెనుక పోలీస్‌సిబ్బంది హస్తం?

దుమ్ముగూడెం, జనవరి 8: దుమ్ముగూడెం అటవీరేంజి సరిహద్దు ఛత్తీస్‌గఢ్ అటవీప్రాంతం నుంచి ఆదివారం భారీగా తరలివెళ్లిన అరవై టేకు చెక్కలు, ఓ డబుల్‌కాట్ మంచాన్ని పాల్వంచ అటవీశాఖ సిబ్బంది అదే రోజు రాత్రి పట్టుకున్నారు. పట్టుబడిన టేకు చెక్కలు, 6-6 సైజు మంచాలు రూ.లక్షకుపైగా విలువ చేస్తాయని సమాచారం. పాల్వంచ చెక్‌పోస్టును తప్పించుకొని వెళ్తున్న టేకు చెక్కల వ్యానును పెద్దమతల్లి గుడి సమీపంలో అటవీశాఖ సిబ్బంది పట్టుకున్నారు. కలపతో సహా వ్యానును పాల్వంచ అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. దుమ్ముగూడెం పోలీస్‌స్టేషన్‌కు ఈ నెల 7న బదిలీపై వచ్చిన ఓ కానిస్టేబుల్ గృహోపకరణాలను ఇక్కడకు తరలించిన వ్యానులోనే అక్రమ కలప రవాణా జరిగినట్లు విశ్వసనీయ సమాచారం.



రవాణాకు ఉపయోగించిన వాహనం

అక్రమార్కులకు ఓ కానిస్టేబుల్ సహకారం..!

పట్టుబడ్డ టేకు కలప అక్రమ రవాణా వెనుక జిల్లాలో కీలకస్థాయి పోలీసు అధికారి వద్ద పనిచేస్తున్న ఓ పోలీసు హస్తమున్నట్లు సమాచారం. అతడికి దుమ్ముగూడెం పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఓ కానిస్టేబుల్ పూర్తిగా సహకరించినట్లు తెలుస్తోంది. టేకు చెక్కలు, డబుల్ కాట్ మంచాలను దుమ్ముగూడెం మండల సరిహద్దు ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతం నుంచి గార్ల మండలానికి రవాణా అవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్

భారీ ఎత్తున పట్టుబడ్డ టేకు చెక్కల వ్యవహారాన్ని తేల్చేందుకు అటవీశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం రంగంలోకి దిగారు. కలప ఎక్కడినుంచి వస్తోంది, ఎవరు తరలిస్తున్నారు, ఎవరెవరి హస్తముందనే కోణంలో విచారణ ప్రారంభించారు. పట్టుబడిన వ్యాను డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో అతడిని వెంట పెట్టుకొని మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ధర్మపేటకు అధికారులు వెళ్లారు. అక్కడ సమ్మయ్య అనే వ్యక్తి నుంచి టేకు చెక్కలు, మంచాలు రవాణా జరిగినట్లు తెలుసుకున్నారు. ఓ పోలీసు సిబ్బందితో కుదిరిన అంగీకారం మేరకే తాను కిరాయికి వాహనాన్ని పెట్టినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులకు వ్యాను డ్రైవరు చెప్పినట్లు సమాచారం. అయితే పట్టుబడిన టేకు కలప గార్లకు తరలిస్తున్నట్లు తెలుస్తుండగా.. గార్ల మండలానికా.. లేక కొత్తగూడెం వరకేనా అనే విషయంలో పలు అనుమానాలున్నాయి.



పట్టుబడిన టేకు చెక్కలు

కాగా ఇటీవల దుమ్ముగూడెం స్టేషన్‌కు చెందిన ఓ కానిస్టేబుల్ రెండు డబుల్ కాట్ మంచాలను తరలిస్తుండగా, భద్రాచలం వద్ద అటవీశాఖ అధికారులు పట్టుకొని వదిలేసినట్లు సమాచారం. స్థానిక పోలీసు సిబ్బందిలో ఒకరిద్దరు ఇటీవల కాలంలో అక్రమంగా టేకు కలపను పెద్దఎత్తున తరలిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినబడుతున్నాయి. పట్టుబడిన టేకు కలప విషయంలో ఎవర్నీ వదిలేది లేదని పూర్తిస్థాయి విచారణ జరుపుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ అధికారి తెలిపారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం

పెనుబల్లికి చెందిన యువ ఇంజనీర్ మృతి



సాయిరాజీవ్‌రెడ్డి(ఫైల్)

పెనుబల్లి, జనవరి 8: అమెరికా టెక్సాస్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెనుబల్లి మండలం వీఎంబంజర్ గ్రామానికి చెందిన యువ ఇంజనీర్ ముక్కర సాయిరాజీవ్‌రెడ్డి (32)దుర్మరణం చెందాడు. ఆదివారం టెక్సాస్‌లో పార్శిల్ సామాన్లు తీసుకొనేందుకు ఇంటినుంచి కారులో వెళ్లిన సాయిరాజీవ్‌రెడ్డి తిరిగి ఇంటికి వస్తుండగా సమీపంలో డివైడర్ నుంచి మరో మార్గానికి తిరిగే మలుపులో కారు స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాయిరాజీవ్‌రెడ్డిని అక్కడి పోలీసులు హెలికాప్టర్‌లో దగ్గరలోని హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయిరాజీవ్‌రెడ్డి మృతి చెందినట్టు బంధువులు తెలిపారు.

వీఎంబంజర్‌కు చెందిన కల్లూరు షుగర్ ఫ్యాక్టరీ సీడీసీ ఛైర్మన్ ముక్కర భూపాల్‌రెడ్డి కుమారుడు సాయిరాజీవ్‌రెడ్డి టెక్సాస్‌లో గత ఐదేళ్లుగా ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. రెండేళ్ల క్రితం వేంసూరు మండలం చౌడవరం గ్రామానికి చెందిన యువతితో రాజీవ్‌రెడ్డికి వివాహం జరిగింది. ఇటీవలనే భార్యను కూడా తన వెంట టెక్సాస్‌కు తీసుకువెళ్లాడు. రాజీవ్‌రెడ్డి తల్లి శివకుమారి నాలుగేళ్ల క్రితం జనవరి ఒకటో తేదీన మృతిచెందింది. భార్య, కుమారుడు జనవరిలోనే మృతిచెందడంతో తండ్రి భూపాల్‌రెడ్డి కన్నీటి పర్యంతమయ్యాడు.

తండ్రికి ఫోన్‌లో సండ్ర పరామర్శ

అమెరికా టెక్సాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో భూపాల్‌రెడ్డి కుమారుడు సాయిరాజీవ్‌రెడ్డి మృతిచెందడం పట్ల సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సీడీసీ ఛైర్మన్ భూపాల్‌రెడ్డిని ఫోన్ ద్వారా పరామర్శించారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

జూలూరుపాడు, జనవరి 8: మండలంలోని బేతాళపాడు పంచాయతీ పరిధిలోని రాచబండ్ల కోయగూడేనికి చెందిన మల్కం బ్రహ్మం(32) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఏన్కూరు మండలం కాలనీ నాచారానికి చెందిన బ్రహ్మం కొన్నేళ్ల క్రితం జూలూరుపాడు మండలం బేతాళపాడు గ్రామానికి చెందిన బొల్లా శిరీషను వివాహం చేసుకున్నాడు. గత ఐదేళ్ల నుంచి బ్రహ్మం తన భార్యతో కలిసి అత్తగారి ఊరు అయిన రాచబండ్లకోయగూడెంలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య సోమవారం ఉదయం చిన్నపాటి ఘర్షణ తలెత్తింది. దీంతో మనస్తాపానికి గురైన బ్రహ్మం ఉదయం 11 గంటల సమయంలో గ్రామ సమీపంలోని ఓ పొలంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో భార్య శిరీష సంఘటన స్థలానికి వెళ్లి చూసే సరికి అప్పటికే మృతిచెంది ఉన్నాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని సోదరుడు మల్కం రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి.పురుషోత్తం తెలిపారు.

వానాకాలం సీఎంఆర్ ధాన్యం లక్ష్యాన్ని సాధించాలి

» వీడియోకాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 8: వానాకాలం, యాసంగి సీఎంఆర్ బియ్యం డెలివరీ లక్ష్యసాధనకు కృషిచేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలెక్టర్‌ను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి వానాకాలం, యాసంగి సీఎంఆర్ రైస్ డెలివరీ ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదుపై ఆయన వీడియోకాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 2022-23 వానాకాలం యాసంగి పెండింగ్ సీఎంఆర్ రైస్ రేషన్‌బియ్యంరీ సైక్లింగ్ కాకుండా తీసుకోవాల్సి చర్యలు, పెండింగ్ ధాన్యం కొనుగోలు గురించి తీసుకోవాల్సిన చర్యలపై ఆయన పలు సూచనలు చేశారు. నిర్దేశిత గడువు జనవరి 31లోగా సీఎంఆర్ రైస్ సరఫరా పూర్తయ్యేలా చేయాలన్నారు. రేషన్ రీ సైక్లింగ్ అవ్వకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల న్నారు. ప్రజాపాలనలో అందిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి రోజు నిర్దేశిత లక్ష్యం మేరకు భారత ఆహార సంస్థకు సీఎంఆర్ బియ్యాన్ని సరఫరా చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కస్టం మిల్లింగ్ రైసర్ సరఫరా పూర్తవుతుందనితెలిపారు. ప్రజాపాలనో అందిన దరఖాస్తులుగడువులోగా ఆన్‌లైన్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో ఖమ్మం మునిసిపల్ కమీషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ డి మధుసూదన్ నాయక్, శిక్షణ కలెక్టర్ మయాంక్ సింగ్, జడ్పీ సీఈవో వింజం వెంకట అప్పారావు, డీఆర్డీవో విద్యాచందన, డీపీవో హరికిషన్, డీసీవో విజయకుమారి, డీఎస్వో శ్రీలత, వ్యవసాయశాఖ ఏడీఏ సరిత పాల్గొన్నారు.

ఖేలో ఇండియా ఖోఖో క్రీడాకారుల ఎంపిక



దేవేందర్



స్రవంత్

కల్లూరు, జనవరి 8: ఖేలో ఇండియా ఖోఖో పోటీలకు ఖమ్మం జిల్లా నుంచి ఇద్దరు క్రీడకారులు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర బాలుర ఖోఖో పోటీలకు క్రీడాకారులను ఆహ్వానించారు. ప్రతి జిల్లా నుంచి ఐదుగురు పాల్గొనగా అందులో అత్యున్నత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను 15మందిని ఎంపిక చేశారు. వారిలో ఖమ్మం జిల్లా నుంచి బచ్చల శ్రవంత్, కే.దేవేందర్ ఉన్నారు. వీరిద్దరూ తమిళనాడు రాష్ట్రం మధురైలో జరగనున్న జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు 26 నుంచి 30 వతేదీ వరకు మధుర నగరంలో జరగనున్నాయి. ఎంపికైన ఇద్దరు క్రీడాకారులను ఖమ్మం జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.వీరరాఘవయ్య, అధ్యక్షుడు రామయ్య, కోశాధికారి సీహెచ్.శ్రీహరి, జాయింట్ సెక్రటరీ పి.నరసయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్‌కే.రంజాన్, కే.రాధాకృష్ణ, ఏజెన్సీ ఇన్‌చార్జి ఎస్.రామారావు, ఏ.కృష్ణ, పి.పవన్‌కుమార్, ఎస్.ప్రసాద్, మహిళ విభాగం ఇన్‌చార్జిలు జి.రమాదేవి, పి.కవిత అభినందనలు తెలిపారు. ఈ క్రీడలకు బీజీఎఫ్ ట్రస్టు నిర్వాహకులు ఎ.రంగారావు అందిస్తున్న సహకారనికి కృతజ్ఞతలు తెలిపారు.

చెల్లెలి వరసైన యువతిపై
అత్యాచారయత్నం

దుమ్ముగూడెం, జనవరి 8: చెల్లెలి వరసైన యువతిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు ఓ ఆటో డ్రైవరు. ఈ సంఘటన ఆదివారం రాత్రి పెదబండిరేవు అటవీప్రాంతంలో జరగ్గా.. సోమవారం సీఐ దోమల రమేష్ కేసు నమోదు చేశారు. ఈ నెల 7న సాయంత్రం చర్ల మండలం దేవరపల్లికి చెందిన రాంకుమార్ అనే ఆటో డ్రైవరు దుమ్ముగూడెం మండలం చిననల్లబల్లి బంధువుల వద్దకు వచ్చాడు. పెదనల్లబల్లిలో అన్నప్రాశన వేడుక ఉంది వెళ్లొద్దామని వరసకు సోదరి అయిన చిననల్లబల్లికి చెందిన యువతిని ఆటోలో ఎక్కించుకొని వెళ్లాడు. దారిలో చిననల్లబల్లి సెంటర్లో తన స్నేహితులైన మరో నలుగురు యువకుల్ని ఆటోలో ఎక్కించుకున్నాడు. పెదబండిరేవులో కూడా స్నేహితులున్నారు ఎక్కించుకొని వెళ్దామని అటువైపుగా ఆటోను తిప్పాడు. నేను రానని యువతి గట్టిగా అరిచినప్పటికీ, వినకుండా పెదబండిరేవు గ్రామశివార్లలోకి తీసుకెళ్లాడు. ఆటోలో ఉన్న రాంకుమార్ స్నేహితులైన నలుగురు యువకులు సైతం యువతిని విడిచిపెట్టమని రాంకుమార్‌ను కోరినప్పటికీ వారి మాట వినలేదు. పెదబండిరేవు గ్రామ శివారు అటవీప్రాంతంలో ఆటో ఆపి యువతిని చేయిపట్టుకొని అడవిలోకి లాక్కెళ్లాడు. వద్దని వారించిన స్నేహితుల్ని సైతం.. అడ్డొస్తే చంపుతానని రాంకుమార్ బెదిరించాడు. అనంతరం యువతిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. యువతి ప్రతిఘటించి రోడ్డుమీదకు పరిగెత్తుకుంటూ వచ్చింది. ఆ సమయంలో ముల్కనాపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై అటువైపుగా రావడం చూసి రాంకుమార్ అక్కడి నుంచి పారిపోయాడు. గ్యాంగ్ రేప్ అని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలో నిజం లేదని సీఐ తెలిపారు.

ఇంటిని తొలగిస్తామంటున్నారని మహిళ ఆవేదన



బాధితురాలు తిరుపమ్మ



తిరుపమ్మ ఇంటి కరెంటు బిల్లు

చింతకాని, జనవరి 8: పదేళ్లుగా నివాసముంటున్న ఇంటిని ఆర్అండ్‌బీ అధికారులు తొలగిస్తామంటున్నారని మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన ఇంటి తిరపమ్మ అనే మహిళ తన ఆవేదన వ్యక్తం చేసింది. తిరపమ్మ ఖమ్మం-బోనకల్ ఆర్అండ్‌బీ రహదారి సమీపంలో రామకృష్ణాపురం క్రాస్ రోడ్డు వద్ద రేకుల షెడ్డు నిర్మించుకుని కిరాణం నడుపుకొంటూ జీవనం కొనసాగిస్తోంది. బాధితురాలి ఇల్లు పంచాయతీ రికార్డుల్లో నమోదు కావడంతోపాటు కరెంటు మీటరు మంజూరుకావడంతో సంబంధించిన బిల్లులు క్రమం తప్పకుండా చెల్లిస్తుంది. ఆర్అండ్‌బీ అధికారులు ఇల్లు తొలగించాలని ఒత్తిడి తెస్తున్నారని, ఇంటిని తొలగిస్తే తమ కుటుంబ జీవనాధారం కోల్పోతామని తిరుపమ్మ ఆందోళన వ్యక్తం చేస్తోంది. తమ బతుకుదెరువునను దూరం చేయెద్దని అధికారులను వేడుకుంటోంది.

ఆగేనా.. సాగేనా?

- నూతన జిల్లాలకు సంబంధించి జుడిషియల్ కమిషన్ ఏర్పాటుపై సీఎం ప్రకటన
- కొత్త వాటి ఏర్పాటు శాస్త్రీయంగా జరగలేదని వ్యాఖ్య
- ప్రజాభిప్రాయాలను అసెంబ్లీలో చర్చించి పునర్విభజనంటూ ప్రకటన
- సత్తుపల్లి జిల్లా ఏర్పాటుపై రకరకాల చర్చలు



సత్తుపల్లి జిల్లా తెరపైకి వచ్చింది.

సత్తుపల్లి, జనవరి 8: సత్తుపల్లి కేంద్రంగా జిల్లా ఏర్పాటు అంశం మళ్లీ మొదటికి వచ్చింది. సత్తుపల్లి జిల్లా ఏర్పాటు ఆకాంక్షను గుర్తించిన ప్రధాన రాజకీయ పార్టీలు గత అసెంబ్లీ ఎన్నికల్లో సత్తుపల్లి జిల్లా ఏర్పాటు చేస్తామంటూ హామీలు ఇచ్చాయి. కాని ప్రస్తుతం సత్తుపల్లి జిల్లా ఏర్పాటు ప్రక్రియ విషయం అలా ఉంచితే తాజాగా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి బిగ్‌డిబేట్ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొత్త జిల్లాల ఏర్పాటు చేసిన వ్యాఖ్యలు, వాటిపై జుడిషియల్ విచా రణ జరిపి పునర్విభజన చేస్తామని ప్రకటన చేయటంతో సత్తుపల్లి జిల్లా మళ్లీ చర్చ నీయాంశంగా మారింది. సుదీర్ఘ కాలంగా సత్తుపల్లి ప్రాంత ప్రజల ఆకాంక్షగా ఉన్న జిల్లా ఏర్పాటు కొత్త సంవత్సరంలో నెరవేరుతుందా అని ఈ ప్రాంత ప్రజలు ఎదురు చూస్తున్న క్రమంలో ముఖ్యమంత్రి వ్యాఖ్యలతో సత్తుపల్లి జిల్లా తెరపైకి వచ్చింది.

ఖమ్మం జిల్లా రెండుగా విభజన.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత 2016లో జిల్లాల పునర్విభజన చేసి కొత్త జిల్లాలు ఏర్పాటు చేసింది. ఖమ్మం జిల్లాను విభజించి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలను ఏర్పాటు చేసారు. అప్పట్లోనే సత్తుపల్లి కేంద్రంగా సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలను కలపి కొత్త జిల్లా ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు ఆందోళన చేసిన విషయం విదితమే. 2016 అక్టోబరు నుంచి 129 రోజుల పాటు సత్తుపల్లిలో జేఏసీ ఆధ్వర్యంలో దీక్షలు చేశారు. వంటా వార్పు, రాస్తారోకో, సత్తుపల్లి బంద్. పాదయాత్రలు కూడా నిర్వహించారు. రెండు నియోజకవర్గాల పరిధిలో 180 గ్రామ పంచాయతీల నుంచి తీర్మానాలను కూడా చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. ఆందోళలను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. అప్పటి నుంచి ఏ ఎన్ని కలు వచ్చినా సత్తుపల్లి జిల్లా డిమాండ్‌ను జిల్లా సాధన సమితి నాయకులు వినిపి స్తూనే ఉన్నారు. అయినా రాజకీయ నాయకులు పట్టించుకోలేదు. గత అసెంబ్లీ ఎన్నిక ల్లో ప్రధాన పార్టీల నాయకులు, అభ్యర్థులు కూడా సత్తుపల్లి జిల్లా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధి కూడా ఇదే హామీ ని ఇచ్చారు. జిల్లా ఏర్పడుతుందని సత్తుపల్లి ప్రాంత ప్రజల్లోఆశలు చిగురిస్తున్న క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో తీవ్ర చర్చకు దారితీసింది.

ముఖ్యమంత్రి వ్యాఖ్యలతో... కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లాల విభజన శాస్త్రీయంగా జరగలేదు. జిల్లాల తో పాటు మండలాలు, రెవెన్యూ డివిజన్లను కూడా అడ్డగోలుగా ఏర్పాటు చేసారని సీఎం రేవంత్ అన్నారు. దీనిని సరిదిద్దేందుకు జుడిషియల్ కమిషన్‌ను నియమించి అధ్యయనం చేస్తామని, దీనిపై ప్రజాభిప్రాయం తీసుకొని అసెంబ్లీ చర్చించి పున ర్విభజన చేస్తామని ప్రకటించారు. అడ్డగోలుగా జిల్లాల విభజన చేయటం వల్ల మన సామర్థ్యాలను మనమే తగ్గించుకునట్లు అయిందని కూడా వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు ఇప్పుడు సత్తుపల్లి ప్రాంత ప్రజల్లో చర్చకు దారి తీసాయి. అడ్డగోలుగా జిల్లాల విభజన జరిగిందని చెపుతున్న సీఎం సత్తుపల్లి జిల్లా ఏర్పాటుకు సానుకూలంగా స్పందిస్తారా అనేది ప్రస్తుతం ప్రధానంగా స్థానికులను వేదిస్తున్న ప్రశ్న. దీనికి తోడు సత్తుపల్లి జిల్లా ఏర్పడుతుందని ఆశించిన వారికి జుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేస్తామంటూ సీఎం చెప్పటంతో జిల్లా ఏర్పాటు ఈ కమిషన్ పరిధిలోకి వెళ్ళినట్లు అవుతుందని, కమీషన్ వద్ద జిల్లా ఏర్పాటు కోసం హామీ ఇచ్చిన నాయకులు, ప్రజాప్రతినిధులు సానుకూలంగా తమ వాదన వినిపించాల్సి ఉంటుంది. సత్తుపల్లి జిల్లా సాదన కోసం ఎదురు చూస్తున్న క్రమంలో ముఖ్యమంత్రి నోట జుడిషియల్ కమిషన్ ఏర్పాటు, అసెంబ్లీలో చర్చ, తిరిగి జిల్లాల పునర్విభజన వ్యాఖ్యలు వెలువడటంతో సత్తుపల్లి జిల్లా ఏర్పాటు జిల్లా మళ్లీ మొదటికి వచ్చినట్లుయిందని జిల్లా సాధన సమితి నాయకులు ఈసందర్భంగా చర్చించుకుంటున్నారు.

పురిటిగడ్డపై ఎనలేని మమకారం

ఏజెన్సీలో గ్రామాల అభివృద్ధికి చేయూతనందిస్తున్న ప్రవాస భారతీయులు .. నేడు ప్రవాస భారతీయ దినోత్సవం



నన్నపనేని మోహన్



గుజ్జుల రవీందర్



తాళ్లూరి జయశేఖర్





దుమ్ముగూడెం మండలం నర్సాపురంలో సూదిరెడ్డి సోదరులు నిర్మించిన పాఠశాల భవనం
భద్రాచలంలోని నన్నపనేని మోహన్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల

భద్రాచలం, జనవరి 8: ఏ దేశమేగినా, ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని.. నిలపరా నీ జాతి నిండు గౌరవం. సరిగ్గా ఈ మాటలనే ఆచరణలో చేసి చూపుతున్నారు ఈ ప్రవాస భారతీయులు. జన్మభూమిపై మమకారంతో తాము పుట్టిన నేలకు, ప్రాంతానికి సేవలు చేస్తున్నారు. అమెరికా, జర్మని తదితర దేశాల్లో సాఫ్ట్‌వేర్, వైద్యరంగాల్లో స్థిరపడ్డ వారు భద్రాద్రి ఏజెన్సీలో అభివృద్ధికి తమవంతు సహకారం ఇస్తున్నారు. అయితే ఇందులో కొందరు ఇప్పటికే ఆయా దేశాల్లో అత్యున్నత స్థానాల్లో ఉండి భద్రాద్రి ఖ్యాతిని అంతర్జాతీయస్థాయిలో ఇనుమ డింపజేస్తున్నారు. ఈ క్రమంలో ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో విద్య, వైద్య, సాంస్కృతిక, క్రీడా రంగాల వికాసానికి కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో వారు భద్రాచలం ఏజెన్సీలో విద్య, వైద్య, సాంస్కృతిక, క్రీడా రంగాల అభివృద్ధి కోసం తమ వంతు చేయూతను అందిస్తున్నారు. వీరిలో జర్మనీ దేశంలోని అట్లాండ్స్ బర్గ్ మాజీ మేయరు, బ్రాండెన్‌బర్గ్ మాజీ పార్లమెంటు సభ్యుడు గుజ్జుల రవీందర్, అమెరికాలో తానా పూర్వ అధ్యక్షులు జయశేఖర్ తాళ్లూరి, నన్నపనేని మోహన్, సూదిరెడ్డి వీరారెడ్డి, సూదిరెడ్డి రామకృష్ణారెడ్డిలు ఉన్నారు. ప్రవాసీ దివస్ మంగళవారం జరుపుకుంటున్న క్రమంలో ఆంధ్రజ్యోతి అందిస్తున్న కథనం.

ఏటా రూ.40 లక్షలతో చేయూత

జయశేఖర్ తాళ్లూరి, రాజా శ్రీకృష్ణ తాళ్లూరి సోదరులు తాళ్లూరి ట్రస్టు ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఏటా రూ.40 లక్షలతో విద్యవైద్య, సాంస్కృతిక, క్రీడారంగాలకు చేయూతనందిస్తున్నారు. అదేవిధంగా భద్రాచలంలోని సరోజని వృద్ధాశ్రమానికి గతంలో భవన నిర్మాణం చేపట్టారు. కాగా ప్రతి నెల నిర్వహణకు ప్రతి నెల రూ.20 వేలు అందిస్తున్నారు. భద్రాద్రి బాలోత్సవం నిర్వహణలో ప్రదాన భూమిక గతం లో పోషించారు. కాగా భద్రాద్రి కళాభారతి సాంస్కృతిక కార్యక్రమాలకు సహకారం అందిస్తున్నారు. అలాగే క్రికెట్ పోటీల నిర్వహణకు చేయూతనిస్తున్నారు.

జన్మభూమి స్ఫూర్తితో నన్నపనేని మోహన్

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్న సమయంలో భద్రాచలంలో సీతారామచంద్రస్వామి దేవస్థానానికి తానా పూర్వ అధ్యక్షుడు నన్నపనేని మోహన్ తన సతీ మణి శ్యామా పేరుతో శ్యామా విహార్ అనే కాటేజీని రూ.20 లక్షలతో నిర్మించారు. అలాగే చర్ల రోడ్డులో నన్నపనేని మోహన్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను రూ.40 లక్షలతో నిర్మించారు. అదేవిధంగా భద్రాచలంలో గతంలో నిర్వహించిన భద్రాద్రికప్ రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఆర్థికంగా చేయూతనందించారు. అలాగే కొన్నేళ్ల పాటు భద్రాద్రి కళాభారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలకు ఆర్థిక సహాయం చేశారు.

సూదిరెడ్డి సోదరుల ఆధ్వర్యంలో రూ.1.20 కోట్లతో పాఠశాల నిర్మాణం

దుమ్ముగూడెం మండలానికి చెందిన సూదిరెడ్డి వీరారెడ్డి, సూదిరెడ్డి రామకృష్ణారెడ్డిలు తమ తల్లి సూదిరెడ్డి ఆదిలక్ష్మ్మ జ్ఞాపకార్థం నర్సాపురంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల భవనాన్ని సుమారు రూ.1.20 కోట్లతోనిర్మించారు. అలాగే పాఠశాలలో చదివే విద్యార్థులకు పరీక్ష ప్యా డ్లు, షూలు ఇచ్చారు. పాఠశాలలో ప్రథమ స్థానం, ద్వితీయ స్థానం సాధించిన వారికి ప్రోత్సాహకాలను అంద జేస్తున్నారు.

రవీందర్ గుజ్జుల సేవా కార్యక్రమాలు

1974లో వైద్య విద్యను అభ్యసించేందుకు జర్మనీకి వెళ్లిన గుజ్జుల రవీందర్ అక్కడ వైద్యవృత్తిలో స్థిరపడ్డారు. జర్మనీ దేశంలోని అట్లాండ్స్‌బర్గ్‌లో ఆయన 25 ఏళ్లుగా మేయరుగా బాధ్యతలు నిర్వహించారు. అలాగే 2009లో పార్లమెంటు సభ్యుడిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. నిర్వహించే అవకాశం ఆయనకు దక్కింది. ఆయన గతంలో ఆంధ్రప్రదేశ్‌లో ఆయన తల్లిదండ్రుల పేరిట కల్యాణ మండపాన్ని నిర్మించారు. అలాగే సునామీ సమయంలో విజయవాడ, అవనిగడ్డ తదితర ప్రాంతాల్లో 215 ఇళ్ల నిర్మాణం చేసేందుకు దోహ దపడ్డారు. అదేవిధంగా సముద్రతీరంలోని మత్స్యకారుల పిల్లల కోసం ఆరు పాఠశాలలు ఏర్పాటు చేశారు. అలాగే పునరావాస కేంద్రాలను కూడా నిర్మించారు.. ఇంకా చాలా సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఆర్వోబీ మార్గం కాదిది.. జలపాతానికి దారి

- నాణ్యతాప్రమాణాలకు కాంట్రాక్టర్ తిలోదకాలిచ్చిన ఫలితం
- ఇబ్బందులుపడుతున్న ప్రయాణికులు
- ఇదీ బోనకల్ రైల్వే గేటు వద్ద పరిస్థితి



రహదారి మార్గంలో నిలిచిన నీరు



సైడ్‌వాల్స్ నుంచి వస్తున్న నీళ్లు

బోనకల్, జనవరి 8: ప్రయాణీకుల సౌకర్యార్థం ఆర్వోబీ నిర్మించారు. కానీ చూపరులకు, వాహనదారులకు మాత్రం ఓ జలపాతానికి దారిలా కనిపిస్తోంది. బోనకల్ నుంచి ఆళ్లపాడుకు వెళ్లే రహదారిలో గల రైల్వే గేటు వద్ద గత ఏడాది రూ. ఐదు కోట్ల నిధులతో అండర్ బ్రిడ్జి నిర్మించారు. నాడు ఆర్వోబీ డిజైన్ సక్రమంగా లేక పోవడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు చేపట్టారని పలువురు విజిలెన్స్ అధికారులకు కూడా ఫిర్యాదు చేశారు. ఎవరూ పట్టించుకోనందున ఇష్టారాజ్యంగా పనులు పూర్తి చేసి బ్రిడ్జిని ప్రారంభించి వెళ్లిపోయారనే విమర్శ లున్నాయి. బ్రిడ్జి పక్కన నిర్మించిన సైడ్ వా ల్స్ నుంచి నిత్యం నీళ్లు లీకవడంతో పాటు ట్రాక్ కింద వేసిన స్లాబ్ నుంచి కూడా వర్షపు సమ యంలో నీళ్లు కిందకు పడుతు న్నాయి. దీని వల్ల భవిష్యత్‌లో ప్రమాదా లు జరిగే అవకాశాలు లేకపోలేదని ప్రజలు చె బుతున్నారు. ప్రతిరోజు నీటి వరద అండర్ బ్రిడ్జి మార్గంలో వెళ్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీటిని రోడ్డు పైకి రాకుండా రెండు పక్కల ఉన్న కాల్వల్లోకి మళ్లించ డంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో భారీగా నీటి చేరికతో తొందరలోనే రోడ్డు దెబ్బతింటుందని వాపోతున్నా రు. దీనికి తోడు నీళ్లు రహదారి పై ఆగడంతో వాహనదా రులు కింద పడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పై నీళ్లు నిల్వకుండా మరమ్మతులు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నాణ్యతాలోపం.. ప్రయాణికులకు శాపం



నాణ్యతాలోపంతో దెబ్బతిన్న తల్లాడ-భద్రాచలం రోడ్డు

తల్లాడ, జనవరి 8: నాణ్యతాలోపం కారణంగా తల్లాడ-భద్రాచలం ప్రధాన రహదారి మరమ్మతులు మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలిపోయాయి. మరమ్మతులు చేపట్టిన కొద్దికాలానికే ప్రధాన రహదారిపై తారు, కంకర లేయర్ ధ్వంసమై గుంతలేర్పడుతున్నాయి. తల్లాడ నుంచి నర్సింహారావుపేట వరకు తల్లాడ-భద్రాచలం ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిలో సుమారు ఎనిమిది కిలోమీటర్ల మేరకు బిట్లు వారీగా మరమ్మతులు చేపట్టేందుకు రూ.1.60కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో మొత్తం 53 బిటల్లో మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా ప్రస్తుతం ఐదు కిలోమీటర్ల మేరకు 23బిట్లలో మరమ్మ తులు పూర్తిచేశారు. నాణ్యతాలోపం వల్ల పూర్తయిన మర మ్మతులు జరిగిన పలుచోట్ల ప్రధాన రహదారిపై తారు, కంకరతో వేసిన రోడ్లు లేచిపోయి తిరిగి గుంతలే ర్పడుతున్నాయి. దీంతో నిత్యం తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు వెళ్లే వందలాది వాహనాల రాకపోలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంది. నాణ్యతా లోపం వల్ల మరమ్మ తులు చేపట్టిన కొద్దికాలంలోనే గుంత లేర్పడుతున్న తల్లాడ-భద్రాచలం ప్రధాన రహదారికి తిరిగి పటిష్ఠమైన నాణ్యతాప్రమాణాలతో కూడిన మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

యాసంగి సాగుకు సెలవ్!

- పెనుబల్లిలో ప్రశ్నార్థకంగా వరి సాగు
- అన్నదాతలతో వ్యవసాయాధికారుల సమావేశాలు
- బోర్ల కిందనే వరి నాట్లు వేస్తున్నరైతులు
- ఇప్పటి వరకూ 111 ఎకరాల్లోనే వరి

పెనుబల్లి, జనవరి 8: ఏపుగా వరినార్లు, దమ్ము చేసిన పొలాలు, ఉత్సాహంగా నాట్లు వేసే కూలీలు.. ఇదీ సరిగ్గా ఏడాది క్రితం పరిస్థితి. కానీ ప్రస్తుతం ఏపుగా వరి నార్లు పెరగాల్సిన ప్రాంతంలో బీడు, దుమ్ము చేసిన పొలాల స్థానంలో నిర్మానుష్యంగా, ఉత్సాహంగా నాట్లు వేయాల్సిన చోట నెర్రెలిచ్చిన భూములు.. ఇదీ పెనుబల్లి మండలంలో పరిస్థితి. ఫలితంగా ఈ ఏడాది యాసంగిలో వరి సాగుకు రైతులు దాదాపుగా విరామం ఇచ్చారు. గత ఏడాది కాల్వలు, ఎత్తిపోతల పథకాలు, చెరువులు, బోర్ల ద్వారా పె నుబల్లి మండలంలో సుమారు 20వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. కానీ ఈ ఏడాది కేవలం బోర్లపై ఆధారపడి ఐదువేల ఎకరాల్లో మాత్రమే సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. మండలంలోని ప్రధాన సాగునీటి వనరులైన లంకాసాగర్ మధ్యతరహా ప్రాజెక్టుతో పాటు రాతోని, సుడిగుండాల తదితర చెరువుల్లోనూ సాగు నీరు లేదు. నాగార్జునసాగర్ ఆయకట్టుకు కూడా నీరు పారే అవకాశం లేకపోవడంతో సుమారు 15వేల ఎకరాల్లో వరిసాగు ప్రశ్నార్థకంగా మా రింది. నాగార్జున సాగర్ కాల్వ ద్వారా తాళ్లపెంట, టేకులపల్లి, బయ్యన్నగూడెం, కారా యిగూడెం గ్రామాల రైతులు ఎత్తిపోతల పథకాల ద్వారా సుమారు మూడువేల ఎకరాల్లో వరిసాగు చేసేవారు. కానీ యాసంగి పంటను సాగుచేసేందుకు మధ్యతరహా ప్రాజెక్టు ఆయకట్టు రైతులను పంటలు సాగుచేయవద్దని అధికారులు సమా వేశాలు పెట్టి చెపుతుండటంతో ప్రాజెక్టు పరిధిలోని ఐదువేల ఎకరాల్లో పంటలు వేసే అవకాశం లేకుండా పోతోంది. చెరువుల ద్వారా సాగయ్యే 7,500 ఎకరాలు సైతం ప్రశ్నార్థకంలోకి పడ్డాయి. దీంతో ఈ ఏడాది యాసంగి సాగు కేవలం వ్యవసాయ బోర్లపై ఆధారపడి మాత్రమే సాగుచేసే అవకాశముంది. దీంతో పాటు ఇప్పటివరకు 111 ఎకరాల్లో కరివేద విధానంలో రైతులు వరి సాగు చేయగా సుమారు వంద ఎక రాల్లో నాట్లు వేశారు. బోర్లు ద్వారా సాగుచేసేది కేవలం ఐదువేల ఎకరాలకు మించి లేదని రైతులు వాపోతున్నారు.

లంకాసాగర్ పరిధిలో యాసంగి సాగు చేయొద్దు

ఐబీ ఎస్ఈఈ ఆనంద్‌కుమార్

పెనుబల్లి, జనవరి 8: లంకాసాగర్ ప్రాజెక్టులో నీరు తక్కువగా ఉన్నందున ఆయకట్టు రైతులు యాసంగి వరిపంటను సాగుచేయవద్దని నీటిపారుదలశాఖ కల్లూరు ఎస్ఈఈ ఆనంద్‌కుమార్ సూచించారు. సోమవారం నీటిపారుదలశాఖ కార్యాలయంలో లంకాసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. లంకాసాగర్ ప్రాజెక్టు పరిధిలోని రైతులు వరిసాగు చేయడం వల్ల పంటలకు నీరివ్వలేదని, ప్రాజెక్టులోని నీరు పశువులకు తాగునీరు, మత్స్యసంపద పెంపుదలకు మాత్రమే సరిపోతుందని ఈ విషయాన్ని రైతులు గమనించి వరిపంట సాగుచేయవద్దని కోరారు. సమావేశంలో డీఈఈ రామారావు, ఏఈఈ కిరణ్ కుమార్, ఆయకట్టు రైతులు మోరంపూడి బాబూరావు, రామారావు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐబీ ఎస్ఈఈ ఆనంద్‌కుమార్



నీరు లేకపోవడంతో ఖాళీగా ఆయకట్టు

వచ్చే నెల మొదటి వారంలో ఐటీడీఏ పాలకవర్గ సమావేశం

భద్రాచలం, జనవరి 8: ఫిబ్రవరి నెల మొదటి వారంలో భద్రాచలం ఐటీడీఏ పాలకవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు పీవో ప్రతీక్‌జైన్ తెలిపారు. ఇందుకు సంబంధించి సోమవారం కార్యాలయంలోని అన్ని శాఖల అధికారులతో పీవో సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల బాధ్యులు పాలకవర్గం సమావేశానికి నిర్దేశించిన నివేదికలను సిద్ధం చే యాలని ఆదేశించారు. సంబంధిత యూనిట్ అధికారులు శాఖల వారీగా నివేదికలను రూపొందించడంతో పాటు వాటి పురోగతిపై ఎప్పటికప్పుడు తెలియజేయాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా డీఎంహెచ్‌వో శిరీష, ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, డీడీ మణెమ్మ పాల్గొన్నారు.

మక్కువ అంతంతే!

సాగర్ నీరు రాకపోవడంతో మొక్కజొన్న సాగును తగ్గించిన రైతులు

విస్తారంగా నల్లరేగడి భూములు.. గలాగలా పారే సాగర్ జలాలు.. అవనికి పచ్చని కోక చుట్టినట్టు ఉండే మొక్కజొన్న చేలు.. కనుచూపు మేరంతా పచ్చదనమే. అంతర సేద్యం చేస్తూ రైతులు, పై పాటు పనుల్లో కూలీలు.. అబ్బో ఆ సందడి చెప్పతరం కాదు. అలాంటిది ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. సాగర్ కాల్వల్లో నీరు లేదు. నీరు వస్తోందనే ఆశలేదు. ఫలితంగా మొక్కజొన్న సాగు పడిపోయింది. కొందరు రైతులు బోర్లు వేసి మరీ పంటను సాగు చేస్తున్నారు.

నీరు రాక సాగు చేయలేదు రైతు జరపల శ్రీను, బోడియాతండా



సాగర్ కాల్వల ద్వారా నీళ్లు వస్తాయనుకున్నా. రెండు ఎకరాలలో మొక్కజొన్న సాగు చేద్దామని సిద్ధం చేసుకున్నా. కాల్వనీరు రాకపోవడంతో భూమి ఖాళీగా ఉంచలేక పెసర వేశా. వేరే రైతు బోరుద్వారా పెసరకు ఒకటి, రెండు తడులు ఇచ్చే ప్రయత్నంలో ఉన్నా.

మొక్కజొన్న వేసి 19రోజులయింది : ఒగ్గు వీరభద్రం, రైతు, తనికెళ్ల



కాల్వ వస్తుందని ఎదురుచూశా. భూమిని ఖాళీగా భూమిని ఉంచలేక మొక్క జొన్న వేశా. 19రోజులు అయింది. పంట ఎండిపోతుందని భయమేస్తోంది. కాపాడు కునేందుకు ప్రయత్నాలు చేస్తున్నా. కాల్వ నీరు వస్తే ఇబ్బందులుండేవి కావు. నీటి కోసం విపరీతమైన పెట్టుబడులు పెట్టాల్సి వస్తోంది.

నీరు రాకపోవడంతో సాగు తగ్గింది: ఏవో బాలాజీ

ప్రాజెక్టుల్లో నీరులేకపోవడంతో సాగర్‌కాల్వ రాకపోవడం వల్ల మొక్కజొన్న విస్తీర్ణం తగ్గింది. బోర్లు, బావులు కింద రైతులు సాగు చేశారు. సాగు చేసిన పంట బాగానే ఉంది. గతంతో పోలిస్తే చాలా వరకు తగ్గింది. ప్రస్తుతం ఇప్పటికి 6వేల ఎకరాలలో పంటను సాగు చేశారు.

కొణిజర్ల, జనవరి 8: యాసంగి పంటయిన మొక్కజొన్న సాగుకు ఎన్నెస్పీ కాల్వల కింద రైతులు స్వస్తి చెప్పారు. నీటి సౌకర్యం లేకపోవడంతో రైతులు పంటకు విరా మం చెప్పాల్సి వచ్చింది. సకాలంలో సాగర్‌కాల్వ నీళ్ల వస్తే రైతులు మొక్కజొన్న సా గును విస్తారంగా చేపట్టేవారు. కాల్వనీళ్ల రాకపవోడంతో రైతులు ఆసక్తి చూపడం లేదు. ఎన్నెస్పీ కింద కొంతమంది రైతులు సాగు చేపట్టినప్పటికి వారు నీరు కోసం నానా అవస్థలు పడుతున్నారు. ఎన్నెస్పీ కాల్వలో పరిధిలోని రైతులు కూడా ఈ ఏడా ది జోరుగా బోర్లు వేశారు. లక్షలు పెట్టి కష్టంగా సాగు చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగర్‌నీరు రాకపోవడంతో కాల్వల పరిధిలోని అధిక సంఖ్యలో రైతులు మొక్కజొన్న సాగుకు నోచుకోలేకపోయారు.

తగ్గిన పంట విస్తీర్ణం

ఎన్నెస్పీ కాల్వల రాకపోవడంతో సాగు విస్తీర్ణం పూర్తిగా తగ్గింది. గతంలో మండలంలో 14,800 ఎకరాలు మొక్కజొన్న సాగయింది. ఈ యాసంగిలో 6 వేల ఎకరాలు మాత్రమే సాగు చేశారు. అది కూడా బోరు, బావుల కింద సాగయిందే. ప్రతి ఏటా మొక్కజొన్న సాగు పెరుగుతూ వచ్చేది. ఈ ఏడాది మాత్రం పూ ర్తిస్థాయిలో తగ్గింది. కాల్వల్లో నీరు రాకపోవడంతో రైతులు బోర్ల పై దృష్టి పెట్టారు. వేలాదిరూపాయాలు పెట్టుబడులు పెట్టి మరీ బోర్లు వేయిస్తున్నారు. కొన్ని చోట్ల నీరు లేకపోవవడంతో మొక్కజొన్న ఎండుతోంది. ఆ పంటను చూడలేక రైతులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం.



బావుల కింద సాగవుతున్న మొక్కజొన్న

అన్ని రంగాల్లో గిరిబిడ్డలు రాణించాలి

- తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదవించాలి
- భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు.. ఘనంగా ప్రారంభమైన ఇగ్నైట్ ఫెస్ట్



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

భద్రాచలం, జనవరి 8: గిరి బిడ్డలు అన్ని రంగాల్లో రాణించాలని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో తమ పిల్లలు చదివేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. భద్రాచలంలోని గిరిజన గురుకుల విద్యా సంస్థలో సోమవారం తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్స్ సొసైటీ స్టేట్ ఇగ్నైట్ ఫెస్ట్ ఇతోస్ 2024ను ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్‌తో కలిసి ఎమ్మెల్యే వెంకట్రావు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో చక్కని విద్య అందుతోందని, బాల బాలికలు ఒక లక్ష్యాన్ని పెట్టుకొని ఆ లక్ష్యాన్ని చేదించే వరకు విశ్రమించాలని అన్నారు. గిరి బిడ్డలు విద్యతో పాటు ఆటపాటల్లో రాణించడం సంతోషకరమన్నారు. విద్యలో రాణించడం ద్వారా ఉన్నత అవకాశాలు కలుగుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం పీవో ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ బాల బాలికల్లో సృజనాత్మక శక్తిని వెలుగులోకి తీసుకొచ్చేందుకు ఇటువంటి ఇగ్నైట్ ఫెస్ట్ కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఇగ్నైట్‌లో పాల్గొనే బాల బాలికలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఉత్తమ ప్రతిభను ప్రదర్శించి విజేతలుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆకాడ్ డిప్యూటీ సెక్రటరీ ఎం.శ్రీనివాసరెడ్డి, ఓఎస్‌డీ ఎస్.శ్రీనివాసకుమార్, గురుకులాల ఓఎస్‌డీ సీతఎస్.సుమలత, గురుకుల ప్రాంతీయ సమన్వయ అధికారి టి.వెంకటేశ్వరరాజు, వరంగల్ ఆర్‌సీవో డీఎస్ వెంకన్న, మహబూబాబాద్, ఆర్సీవో కె.నాగార్జున పాల్గొన్నారు.







ఇగ్నైట్‌ఫెస్ట్‌లో విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో, ఎమ్మెల్యే, ఇగ్నైట్‌ఫెస్ట్‌లో విద్యార్థుల మాక్ పార్లమెంట్, శాస్త్రీయ నృత్యం చేస్తున్న విద్యార్థులు

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో 11న కూడారై ఉత్సవం

నేలకొండపల్లి, జనవరి 8: నేలకొండపల్లిలోని అత్యంత పురాతనమైన శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాసవిశేష ఉత్సవాలలో భాగంగా ఈనెల 11 గురువారం ఉదయం 6గంటల నుంచి 8గంటల వరకు కూడారై ఉత్సవం నిర్వహించనున్నట్లు అర్చకుడు తూపురాణి మధుసూధనాచార్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు తులసీ సహస్రనామార్చన సహిత, మహిళలచే కుంకుమ పూజలు నిర్వహించబడతాయన్నారు. అదే విధంగా 14వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కూడారై ఉత్సవం, గోదాదేవ కల్యాణంలను విజయవంతం చేయాలని మధుసూధనాచార్యులు ప్రకటనలో కోరారు.

డేటా నమోదులో పొరపాట్లు ఉండొద్దు

- కంప్యూటర్ ఆపరేటర్లకు కలెక్టర్ గౌతమ్ ఆదేశం
- తనికెళ్లలోని 'విజయ' కళాశాలలో ఆన్‌లైన్ ప్రక్రియ రిశీలన


ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

కొణిజర్ల, జనవరి 8: ప్రజాపాలన దరఖాస్తులకు సంబంధించి డేటా నమోదు ఎలాంటి పొరపాట్లు లేకుండ ఖచ్చితత్వంతో చేయాలని కలెక్టర్ వి.పి.గౌతమ్ ఆదేశించారు. సోమవారం స్థానిక విజయ ఇంజనీరింగ్ కళాశాలలో కొణిజర్ల మండలానికి సంబంధించిన ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయని, ప్రజాపాలన పోర్టల్‌లో నమోదు చేశారని ఆరా తీశారు. ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బందిని ఏమైన సందేహాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రేషన్‌కార్డు నెంబర్‌లు, ఆధార్‌కార్డు నెంబర్‌లు ఫిజికల్ దరఖాస్తులలో సరితూకాలన్నారు. ఎప్పటికప్పుడు డేటా ఎంట్రీని చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి సుమ, ఎంపీడీవో మహాలక్ష్మీ, తహసీల్దార్ తఫజల్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

12లోగా ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తి: కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్: ప్రజాపాలనలో అందిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను ఈనెల 12లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో కలెక్టర్ గౌతమ్ సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా 4,88,316 దరఖాస్తులు అందినట్లు చెప్పారు. జిల్లాలో 40 ప్రాంతాల్లో 1310 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించి ఆన్‌లైన్ చేస్తున్నట్లు తెలిపారు. జనవరి 5న ప్రారంభమైన డేటా ఎంట్రీ కార్యక్రమంలో ఈనెల 12లోగా పూర్తి చేయాలని నిర్దేశించినట్లు తెలిపారు.

ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్ ప్రక్రియ

ఖమ్మంకార్పొరేషన్: నగరపాలకసంస్థ పరిధిలో 80వేలకు పైగా దరఖాస్తులు రావటంతో పెద్దసంఖ్యలో ఆపరేటర్లను ఆన్‌లైన్ ప్రక్రియ నమెదుకు వినియోగిస్తున్నారు. ఆన్‌లైన్‌లో నమెదు చేయటంతో సర్వర్ తరచూ మొరాయిస్తున్నది. సర్వర్ స్లోగా పనిచేయటంతో ఆన్‌లైన్ ప్రక్రియలో జాప్యం జరుగుతోంది.

ముమ్మరంగా ఆన్‌లైన్

రఘునాథపాలెం: మండలంలో వేగవంతంగా జరుగుతుంది. మండలలో మొత్తం 19,625 దరఖాస్తులు రాగా ఇప్పటికే 8వేలకు పైగా దరఖాస్తులు ఆన్‌లైన్ పూర్తి జరిగాయి. సోమవారం ఆన్‌లైన్ ప్రక్రియను ఎంపీడీవో రామకృష్ణ పర్యవేక్షణ చేశారు.

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ

వైరా: వైరా మునిసిపల్ కార్యాలయం, మండల ప్రజాపరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో మూడు బృందాలు ఈ ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నారు. మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్ సూతకాని జైపాల్ దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. అలాగే ఎంపీడీవో డి.కరుణాకర్‌రెడ్డి, తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు పర్యవేక్షిస్తున్నారు.

మండలంలో 16,811 దరఖాస్తులు: అధికారులు

బోనకల్: మండలంలోని 22 మండలంలో 16,811 దరఖాస్తులను స్వీకరించారు. ఎంపీడీవో అశోక్, తహసీల్దార్ పున్నం చందర్ పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే 4576 దరఖాస్తులు ఆన్‌లైన్ చేశామని మిగిలినవాటిని కూడ 12 నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో కృషి చేస్తున్నామని తెలిపారు.

తాగునీటి సరఫరా నిలిచినా పట్టించుకోరా?

- టీచర్లు లేక నాణ్యమైన విద్య అందడం లేదని ఆగ్రహం
- సర్వసభ్య సమావేశంలో సమస్యల పై నిలదీత


తాగునీటి సమస్యలపై అధికారులను నిలదీస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

బోనకల్, జనవరి 8: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ కొంకణాల సౌభాగ్యం అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం గురించి ప్రజా ప్రతినిధులు అధికారులను నిలదీశారు. ప్రధానంగా గోవిందాపురం(ఎ) గ్రామంలో నెల రోజులుగా తాగునీటి సరఫరా నిలిచి పోయినా మిషన్ భగీరథ అధికారులు పట్టించుకోవడం లేదని సర్పంచ్ బాగం శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామంలో ఉన్న రైల్వే ట్రాక్ వద్ద గతంలో భగీరథ పైపులైన్లు వేసి ప్రజలకు తాగునీరు అందించామని సర్పంచ్ పేర్కొన్నారు. ప్రస్తుతం మూడో రైల్వేలైన్ పనులు కొనసాగుతుండటంతో అక్కడ ఉన్నమంచినీటి పైపులైన్ పగిలిపోయింది. తాను రైల్వే అధికారులతో మాట్లాడి కొంత మేరకు పనులు చేసినా పూర్తి స్థాయిలో పైపులు వేయనందున తాగునీటి సరఫరా నిలిచిప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ ఏఈలు ఎర్ర శ్రీనివాసరావు, చైతన్యకృష్ణ మాట్లాడుతూ రైల్వే ట్రాక్ పై పనులు చేయాలంటే తప్పని సరిగా రైల్వే ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఇంకా ఈ సమస్య పై ఎన్ని నెలలు మాట్లాడతారు? మీరు ఏం చేస్తున్నారని సర్పంచ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గోవిందాపురం(ఎల్) ఉన్నత పాఠశాలలో 118 మంది విద్యార్థులు ఉండగా ఆరుగురు టీచర్లు మాత్రమే ఉన్నారని, నాణ్యమైన విద్య అందడం లేదని ఎంపీటీసీ జొన్నలగడ్డ సునిత, సొసైటీ చైర్మన్ మాదినేని వీరభద్రంలు వాపోయారు. మోటమర్రి ఉన్నత పాఠశాలలో గ్రామ పంచాయతీ ద్వార విద్యా వలంటీర్‌ను ఏర్పాటు చేసి విద్యా బోధన సాగిస్తున్నామని సర్పంచ్ కేతినేని ఇందు తెలిపారు. రెగ్యూలర్ టీచర్లను నియమించాలని విజ్ఞప్తి చేశారు. రెషన్ కార్డులతో పాటు సదరమ్ క్యాంపుల నిర్వహణ గురించి ప్రజలకు అవగాహన లేక పోవడం వలన ప్రతి ఏటా ఇబ్బందులు పడుతున్నారని ఆళ్లపాడు సర్పంచ్ మర్రి తిరుపతిరావు ప్రశ్నించారు. ఎంపీడీవో అశోక్, తహసీల్దార్ పున్నం చందర్‌లు స్పందిస్తూ పత్రికల ద్వార తగు సమాచారాన్ని ముందుగా తెలియజేస్తామని హామి ఇచ్చారు. ప్రజా ప్రతినిధులఆగ్రహం, అధికారుల సమాధానాలతో మండల పరిషత్ సమావేశం నామమాత్రంగా ముగిసింది.

రేపటి నుంచి వైరాలో క్రికెట్ పోటీలు

వైరా, జనవరి 8: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రాజీవ్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ తెలిపారు. ఈ పోటీల ప్రచార కరపత్రాన్ని సోమవారం మునిసిపల్ కార్యాలయంలో జైపాల్ ఆవిష్కరించారు. స్థానిక అయ్యప్ప స్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పదో తేదీ ఉదయం పదిగంటలకు ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఈ క్రికెట్ పోటీలు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి రూ.20116, ద్వితీయ బహుమతి రూ.15116, తృతీయ బహుమతి రూ.10116తోపాటు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు 8639174884ను కానీ లేక 8179464294ను కానీ లేక 9063683939ని కానీ సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మిట్టపల్లి నాగి, ధార్న రాజశేఖర్, సయ్యద్ అన్వర్, గరిడేపల్లి కిషోర్, బొల్లం గోపిచంద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ప్రజావాణిలో విజ్ఞప్తి

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 8: సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కలెక్టర్ కార్యాలయానికి బారులు తీరుతున్నారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను కార్యాలయాల్లో నిర్వహించే పిర్యాదులకు ప్రజల నుంచి డిమాండ్ అధికంగా ఉంటోంది. సోమవారం కూడా కలెక్టరేట్ కార్యాలయానికి పిర్యాదు దారులుపెద్దసంఖ్యలోనే వచ్చారు. ప్రజల నుంచి కలెక్టర్ గౌతమ్ దరఖాస్తులను స్వీకరించారు. అధికంగా పింఛన్‌కోసం, సదరం ధ్రువీకరణ పత్రాల కోసం, వృద్దులు మహిళలు తరలివచ్చారు. కలెక్టర్ అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులను పరిష్కారం కోసం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు శిక్షణ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ డి మధుసూదన్ నాయక్, ఆర్డీవో గణేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమ్

అయోధ్య అక్షింతలు ఇంటింటికీ పంపిణీ


బుర్హాన్‌పురంలో ఇంటింటికీ అయోధ్య అక్షింతల పంపిణీ

ఖమ్మం సాంస్కృతికం/ఎర్రుపాలెం /తల్లాడ ఏన్కూరు/మధిరటౌన్, జనవరి 8: అయోధ్య రామాలయ విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో భాగంగా రామభక్తులు ఖమ్మంలోని బుర్హాన్‌పురం, మామిళ్ల గూడెం ప్రాంతాల్లో బాలాక్షితల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో దుద్దుకూరి నాగమణి, మోతుకూరి మాధవి , పిట్టల పద్మ, పిట్టల జ్యోతి, బూర్ల పుష్ప, మోదెల నాగమణి, తాటికొండ సునీత, ఆదూరి శ్రీదేవి,కొమ్మినేని శ్రీదేవి, విజయ, అమరనేని ఝాన్సీ నాగమణి, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, పిట్టల రాంబాబు, ఉప్పు రామప్ప తదితరులు పాల్గొని అయోధ్య రామాలయ నిర్మాణ ప్రచారం చేశారు. ఎర్రుపాలెం, తల్లాడ, ఏన్కూరు, మధిరలోను అయోధ్య శ్రీరాముడి అక్షింతలను గ్రామాలలో పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో శోభయాత్ర నిర్వహించారు. ఆయా ఆలయాల కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

'మిస్ట్' కళాశాలలో రెండు రోజుల వర్క్‌షాపు

సత్తుపల్లి, జనవరి 8 సత్తుపల్లిలోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ రెండు, మూడో సంవత్సర విద్యార్థులకు అడ్వాన్స్‌మెంట్ ఇన్ డేటా విజువలైజేషన్ అనే అంశంపై రెండు రోజులు పాటు వర్క్‌షాపును ఏర్పాటు చేశారు. ఈ వర్క్‌షాపును సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ ప్రారంభించారు. ఈ వర్క్ షాపులో విద్యార్థులకు కార్పోరేట్ ట్రైనర్ జి సందీప్ ఆధ్వర్యంలో డేటా మోడాలింగ్‌అండ్‌ఎనలటిక్స్ అనే అంశంపై నైపుణ్యం పెంపొందించునేందుకు ఈ వర్క్‌షాపును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులందరు ఈ అవకాశంను వినియోగించుకొవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, సిఎమ్‌సి విభాగం నుంచి పి మరేశ్వర రావు, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాఖాహారంతోనే మెరుగైన ఆరోగ్యం

తల్లాడ, జనవరి 8: ప్రకృతి అందించిన శాఖాహారంతోనే మెరుగైన ఆరోగ్యం పొందవచ్చునని సర్పంచ్ మారెళ్ల మమత అన్నారు. తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. అన్నారుగూడెం అవగాహన ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో బ్రహ్మర్షి పితామహ పత్రీజీ, పిరమిడ్ సొసైటీ ధ్యాన బోధకులు శోభారాణి, జ్యోతి, స్థలదాత సాందీపులు, నిర్వాహకులు మారెళ్ల మల్లికార్జునరావు, వెల్లంకి వెంకటయ్య, మారెళ్ల వెంకటయ్య, తాళ్ల జోసఫ్, తుమ్మలపల్లి రమేష్, ఆపతి రామారావు, గుమ్మా వలరాజు, దుగ్గినేని గోపయ్య పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూం కాలనీ సమస్యలు పరిష్కరించాలి

సత్తుపల్లి, జనవరి 8 మండలంలోని గౌరిగూడెం గ్రామంలోని డబుల్ బెడ్‌రూం కాలనీలో నెల కొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసిల్దార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎ కృష్ణ, వెంట్రావ్, మహేష్ బాలజీ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

● మంత్రి పొంగులేటిని కలిసిన గిరిజన రైతులు


మంత్రి పొంగులేటిని కలిసిన గిరిజన రైతులు

కల్లూరు, జనవరి 8 కల్లూరు మండలంలోని హనుమతండ గ్రామ పంచాయతీ పరిధిలో గల పలు భూ సమస్యలను పరిష్కరించాలని సోమవారం పలువురు గిరిజన రైతులు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసిశారు. హనుమతండ గ్రామ సర్పంచు దరవత్ మోహన్‌నాయ్ ఆధ్వర్యంలో పలువురు గిరిజన రైతులు హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రిని కలిసి తమ గ్రామంలో 70 సంత్సరాల క్రితం నుంచి సా గు చేసుకుంటున్న కస్టోడియన్ భూములకు ఇంత వరకు భూమి హక్కు పత్రాలు ప్రభు త్వం పరంగా కల్పించలేదని విన్నవించుకున్నారు. దీంతో తమకు ప్రభుత్వ పరంగా అందాల్సిన రైతు సంక్షేమ పథకాలు అందక త్రీవంగా నష్టపోవాల్సి వస్తుందని వివరించారు. మంత్రి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించారని సర్పంచు మోహన్‌నాయక్ తెలిపారు. మంత్రి పొంగులేటిని కలిసిన వారిలో బాణోతు రాంబాబు, కుసునోతు రవికుమార్, బానోతు చందు, లాల్‌సింగ్, శివాజీనాయక్ గుగులోతు ప్రసాద్ ఉన్నారు.

సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● యాజమాన్యానికి ఎమ్మెల్యే రాగమయి విజ్ఞప్తి


సింగరేణి కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సత్తుపల్లి, జనవరి 8: సింగరేణి ఓబీ కార్మికుల సమస్యలను వారం లోగా పరిష్కరించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్ట రాగమయి దయానంద్ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం సత్తుపల్లిలో సింగరేణి ఓసిలో ఓబీ కాంట్రాక్టు కార్మికులు పలు సమస్యలను పరిష్కరిచాలని యాజమాన్యం వైఖరిని నిరసిస్తూ సమ్మెకు దిగినారు. ఈ మేరకు సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యు నేరుగా ఓబీ కాంట్రాక్టు కార్మికులను కలుసుకొని సమస్యలను తెలుసుకున్నారు. ఓబీ కాంట్రాక్టు కార్మికులకు మాడు నెలలుగా వేతనాలు, పీఎఫ్ చెల్లించటం లేదని, కాంట్రాక్టర్స్ వారి పనులు సకాలంలో పూర్తి చెయ్యకుండా నిర్లక్ష్య వైఖరి చేస్తున్నారని కొత్త టెండర్‌లు సింగరేణి యాజమాన్యం పిలవటం వలన ఓబీ కాంట్రాక్టు కార్మికులు పనులు లేక, జీతాలు లేక కుంటుంబ ఆర్థిక భారంతో సింగరేణి యాజమాన్యంపై సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. కార్మికులకు బాసటగా నిలిచిన ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ ఓబీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యాజమాన్యంకు ఆదేశించారు.

పట్టా భూములను ఇచ్చేదిలేదు

● వైరా ఎమ్మెల్యేకు రైతుల విజ్ఞప్తి

కొణిజర్ల, జనవరి 8: ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీకి తమ పట్టా భూములు ఇవ్వమని సోమవారం వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు క్యాంప్ ఆఫీస్ వద్ద కొణిజర్ల మండలం అంజనాపురం రైతులు వినతిపత్రం అందజేశారు. గోద్రేజ్ వారు 111 సర్వేనెంబర్‌లో 115 ఎకరాల భూమిని సేకరించారని అయిన మళ్లీ అది సరిపోదని పట్టా భూమిని కూడ కావాలని కోరుతున్నారని సంబందిత రైతులు ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితిల్లో తమ పట్టా భూములను ఫ్యాక్టరీకి ఇవ్వమని, మా జీవనాధారమే ఆ భూములని స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆ భూముల గురించి తెలుసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో బాధిత రైతులు పాల్గొన్నారు.

గ్యారెంటీ పథకాలను అమలు చేయాలి

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి 8: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామి ఇచ్చిన విధంగా ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ కోరారు. సోమవారం సీపీఎం జిల్లా కార్యాలయం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన వైరా నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబ్ క్యాలెండర్‌ను ప్రభుత్వం ప్రకటించాలన్నారు. అలాగే మహిళలు, రైతులు, కౌలు రైతులు ప్రభుత్వ పథకాల కోసం నిరీక్షణ చేస్తున్నారన్నారు. పొడు పట్టాలను ఇవ్వాలని కోరారు. తాళ్లపల్లి కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు మెరుగు సత్యనారాయణ, కొండబోయిన నాగేశ్వరరావు, సుధాకర్, మండల కార్యదర్శి నాగేశ్వరరావు, వజ్జా రామారావు,రాములుపాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడి పరామర్శ


నివాళులర్పిస్తున్న రాందాస్, దుర్గాప్రసాద్

వైరా, జనవరి 8: వైరాలో సోమవారం మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సందర్శించి పరామర్శించారు. వైరా మునిసిపాలిటీ మూడోవార్డులో ఇటీవల మృతిచెందిన ఏదునూరి పెద్దకోటయ్య దశదినకర్మలో పాల్గొని ఆయ కుటుంబాన్ని పరామర్శించారు. గన్నవరంలో వేమిరెడ్డి పిచ్చిరెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, కాంగ్రెస్ నాయకులు వడ్డే నారాయణ, పమ్మి అశోక్, బోళ్ల గంగారావు,నివాళులర్పించారు.

బాధిత కుటుంబానికి కూనంనేని పరామర్శ

చింతకాని జనవరి 8: మండల పరిధిలోని రాఘవాపురం గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకులు కొల్లి సీతయ్య మాతృమూర్తి ఇటీవల మృతిచెండంతో సోమవారం ఆమె దశదిన కార్యక్రమం నిర్వహించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.కార్యక్రమంలో కూచిపూడి రవి, సింగారపు సత్యనారాయణ, దొబ్బల వెంగళరావు, అబ్బూరి మహేష్, చలమల అనిల్, కొండపర్తి బాలాజీ, బలగాని విజయ్ పాల్గొన్నారు. పొద్దుటూరులో బీఆర్ఎస్ నాయకులు పెంట్యాల సైదేశ్వరరావు ఇటీవల మృతిచెందడంతో బీఆర్ఎస్ నాయకులు కొండబాల కోటేశ్వరరావు, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు పాల్గొన్నారు.

ఖమ్మం బార్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర శిబిరం

ఖమ్మం లీగల్, జనవరి 8: ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం వాసన్‌ఐ కేర్ హాస్పిటల్ ఖమ్మం జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ హాల్లో ఉచిత కంటి వైద్య పరిక్షలను సోమవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు సాయిక్రిష్ణ, రాజేష్ గోపాల్, వెంకటేష్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మాధిరాజు లక్ష్మినారాయణ, కోశాధికారి ఎం.జే.ప్రవీణ్‌కుమార్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

రూ.72 లక్షలకు దివాళా పిటీషన్ దాఖలు

ఖమ్మం లీగల్ జనవరి 8: ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి ఖమ్మం న్యాయస్థానంలో సోమవారం దివాళా పిటీషన్ దాఖలు చేశారు. కేసు వివరాలు విజయవాడకు చెందిన సోమల బాలకోటేశ్వరమ్మ ఖమ్మం విజయవాడ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. జోలీబ్యాగ్ వర్క్స్ అనే పేరుతో క్యారీ బ్యాగుల వ్యాపారం చేస్తున్నారు. వ్యాపార అభివృద్ధికి అధిక వడ్డీలకు డబ్బులు తీసుకొచ్చారు. ఈ వ్యాపారం అభివృద్ధికోసం మొత్తం 22 మంది వద్ద రూ.72 లక్షల 75వేలను అప్పు తీసుకున్నారు. ఈ వ్యాపారంలో ఒడురొడుకులు రావటంతో వ్యాపారం సరిగ్గా నడవక ప్రతివాదుల నుంచి ఒత్తిడి అధికమవడంతో మొత్తం 22 మంది ప్రతివాదులపై దివాళా పిటీషన్ తమ న్యాయవాదులు తెల్లాకుల రమేష్‌బాబు, జీ.వి.లక్ష్మినారాయణ ల ద్వారా దివాళా పిటీషన్‌ను కోర్టులో దాఖలు చేశారు.

'ఉపాధి' క్షేత్ర సహాయకుల నూతన కమిటీ ఏకగ్రీవం

రఘునాథపాలెం, జనవరి 8: ఉపాధి హామి క్షేత్రసహాయకుల మండల కమిటీని నియామకం చేశారు. ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తూరిగంటి సూర్యం ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన కమిటీలో మండల అధ్యక్షుడుగా బరిగల కోటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా భూక్యా బాలాజీ, ఉపాధ్యక్షులుగా పేరపొగు ఉపేందర్, కోశాదికారిగా చెరుకూరి రాధికలను ఏకగ్రీవంగా నియామకం చేశారు.

11 వరకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు

ఖమ్మం ఖానాపురంహవేలి/ఏన్కూరు, జనవరి 8: 2023-24 విద్యా సంవత్సరంలో ఓపెన్ స్కూల్ పదవ, ఇంటర్మిడియట్ లో అడ్మిషన్లు పొందేందుకు అ నెల 9 నుంచి 11వ తేది వరకే గడువు ఉందని డీఈవో సోమశేఖర శర్మ, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ పాపారావు తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 8008403522లో సంప్రదించాలని తెలిపారు.

ఎఫ్ఎల్ఎన్, తొలిమెట్టు అమల్లో ముందున్న జిల్లా: ఏఎంవో

కొణిజర్ల, జనవరి 8: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టు అమలులో ఖమ్మంజిల్లా ముందుందని ఏఎంవో రవికుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని పల్లిపాడులో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. పాఠశాల వారిగా అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలను, బోధన సామగ్రిని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్యాంసన్, మండల నోడల్ ఆఫీసర్ అబ్రహం, కాంప్లెక్స్ ఉపాధ్యాయురాలు సుజాత పాల్గొన్నారు.

ఇళ్లను వదిలి వెళ్లాలని దౌర్జన్యం చేస్తున్నారని ఫిర్యాదు

ఖమ్మంకార్పొరేషన్, జనవరి 8: 45ఏళ్లుగా నివశిస్తున్న తమ ఇళ్లను వదిలివెళ్లాలని కొందరు దౌర్జన్యం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు సోమవారం నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభికి ఫిర్యాదు చేశారు. త్రీటౌన్ ప్రాంతంలోని పీసీకే తోట. శ్రీరాంనగర్‌లలో తాము 45 ఏళ్లుగా నివశిస్తున్నామని, తమకు నగరపాలకసంస్థనుంచి ఇంటినెంబర్లు ఇచ్చారని, విద్యుత్‌మీటర్లు, ఆధార్, ఆహార భద్రతాకార్డులు అదే ఇంటినెంబర్లతో ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా ఇద్దరు వ్యక్తులు తమను ఇళ్లు ఖాళీచేయాలని బెదిరిస్తూ, ఇళ్లముందు గ్రానైట్ వ్యర్థాలు వేసి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వెంటనే వారిపై చర్య తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.

ఫ్రెండ్స్‌యూత్ ఆధ్వర్యంలో రేపు ముగ్గుల పోటీలు

కొణిజర్ల, జనవరి 8: మండల పరిధిలోని పల్లిపాడు గ్రామంలో ఫ్రెండ్స్‌యూత్ ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఫ్రెండ్స్‌యూత్ అధ్యక్షుడు తాటిపల్లి సుధీర్ సోమవారం తెలిపారు. ఈ పోటీలలో మహిళలు ఎక్కడివారైన పాల్గొనవచ్చని, ముగ్గుల పోటి గ్రామంలోని ఫ్రెండ్స్‌యూత్ మందిరం వద్ద ఏర్పాటు చేయనైనదని తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళంతా పాల్గొనాలని కోరారు.

భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో..

నేలకొండపల్లి, జనవరి 8: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. ఈనెల 11 గురువారం ఉదయం పైనంపల్లి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 12న సదాశివపురం, 13న ఉదయం నాచేపల్లిలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు పాలడుగు పూర్ణచంద్రప్రసాద్, యలమద్ది లెనిన్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని ప్రసాద్, లెనిన్‌లు కోరారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన రేణుకచౌదరి

వైరా, జనవరి 8: కాంగ్రెస్ పార్టీ క్యాలెండర్‌ను కేంద్ర మాజీమంత్రి రేణుకాచౌదరి సోమవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. వైరా కాంగ్రెస్ నాయకుడు కట్ల రంగారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ముద్రించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో రేణుకాచౌదరి రంగారావుతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కట్ల సంతోష్, నాగరాజు, నంద్రు నాగరాజు పాల్గొన్నారు.

గెజిటెడ్ లెక్చరర్ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

కామేపల్లి, జనవరి 8: గెజిటెడ్ లెక్చరర్ల సంఘం టీజీజెఎల్‌ఏ 475 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కామేపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బిజే విద్యాసాగర్ సోమవారం ఆవిష్కరించారు. టీజీజెఎల్‌ఏ సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వినోద్‌బాబు, సెక్రటరి శ్రీనివాసరావు, మహిళా కార్యదర్శి రేవతిలక్ష్మీ, జిల్లా ఈసీ మెంబర్ ఎం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అక్బర్‌పాషా, రాణి, గోపాలక్రిష్ణ, లాలయ్య, రషీద్, పాల్గొన్నారు.

కందాళ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న కందాళ సతీమణి, కుమార్తె

ఖమ్మం రూరల్, జనవరి 8: మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి జన్మదినం మంగళవారం సందర్భంగా మండల పరిదిలోని సాయిగణేష్‌నగర్‌లో ని కందాళ క్యాంపు కార్యాలయంలో సోమవారం తలసీమియా వ్యాధి గ్రస్తుల కోసం కందాళ యువసేనా ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని కందాళ సతీమణి విజయమ్మ, పెద్ద కూతురు దీపికా రెడ్డిలు ప్రారంబించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మణ్ నాయక్, సుడా డైరక్టర్ గూడా సంజీవరెడ్డి, నాయకులు మట్టా వెంకటేశ్వర్లు, కృష్ణారావు, దరగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలని తహసీల్దార్‌కు వినతి

తిరుమలాయపాలెం, జనవరి8: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని వాటిని ప్రభుత్వం స్వాదీనం చేసుకోవాలని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ రాంప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. మండలంలోని పాతర్లపాడురెవెన్యూలో పత్తి మిల్లు ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించకుంటున్నారని , అలాగే తిరుమలాయపాలెంలో కూడా 254సర్వేనెంబరులోని ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, కొలిచలం స్వామి, దాసరి మహేందర్, నాగటి సురేష్, నేర్సుల వెంకటేష్, రాము, పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా ఉపాధి పనుల నిర్వహణ పై ఆగ్రహం

బోనకల్, జనవరి 8: మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో ఉపాధి పనులను ఇష్టారాజ్యంగా నిర్వహించడంతో పలు అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ నాయకులు కందుల పాపారావు, పారా వెంకట మోహన్‌రావు, బుంగా రాములు, తోటకూర వెంకటేశ్వరావు ఆరోపించారు. పంచాయతీ కార్యాలయంలో సోమవారం జరిగిన ఉపాదిహామి గ్రామసభ సమావేశంలో వారు మాట్లాడుతూ నిబంధనలు పాటించకుండా పనులు చేయకపోవడం వలన నిధుల దుర్వినియోగం జరిగిందని కార్యదర్శిని ప్రశ్నించారు. తాము కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు స్పష్టం చేశారు.